PRABHATA SURYA
ప్రభాత సూర్య
తెలుగు దిన పత్రిక
www.suryaa.news
వేల రూ.5/ - పేజీలు : 8 శుక్రవారం 12 సెప్టెంబర్ 2025 సంపుటి: 01, సంచిక : 79
PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

## అనిల్ అంబానీకి ఈడీ మరో షాక్

రిలయన్స్ గ్రూప్ సంస్థల అధినేత అనిల్ అంబానీకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మరో షాక్ ఇచ్చింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ)ను రూ.2,929.05 కోట్లకు మోసం చేసిన రుణ కేసులో రిలయన్స్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్ (ఆర్‌కామ్) డైరెక్టర్‌గా ఉన్న అనిల్ అంబానీపై ఈడీ కొత్త కేసు నమోదు చేసింది. అనిల్ అంబానీతో పాటు పలువురు ప్రభుత్వ అధికారులు, ఇతరుల పైనా కేసు నమోదయ్యిందని తెలుస్తోంది. గత నెలలో సీబీఐ దాఖలు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ ఈ చర్యలు తీసుకున్నట్టు సమాచారం. ఎస్‌బిఐ ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం పలు బ్యాంకులకు అనిల్ అంబానీ నేతృత్వంలోని ఆర్‌కామ్ రూ.40 వేల కోట్లకు పైగా రుణాలు బకాయిలుపడింది. 2018 నాటి గణాంకాల ప్రకారం ఒక్క ఎస్బీఐనే రూ.2929 కోట్ల మేర నష్టపోయింది.

విలేకరులు కావలెను
సీనియర్ జర్నలిస్టుల సారధ్యంలో వస్తోన్న జాతీయ తెలుగు దినపత్రిక 'సూర్య' కి నిబద్ధత కలిగిన యువ, నవతరం కలం యోధులు కావాలి.
96667 32777
ప్రభాత సూర్య
www.suryaa.news

# పెండింగ్ రైల్వే ప్రాజెక్టుల పూర్తికి
# సంపూర్ణ సహకారం



- రైలు-రోడ్డు-పర్యాటక ప్రాంతాలను అనుసంధానం చేసేలా ప్రాజెక్టులకు రూపకల్పన చేయాలి
- ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందరు వరకు అలైన్‌మెంట్ తయారు చేశాం
- ట్రిపుల్ ఆర్ చుట్టూరా 362 కిలోమీటర్ల మేర రింగ్‌రైల్ నిర్మాణం చేపట్టాలి
- రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టులపై దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులతో సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

**సూర్య హైదరాబాద్**

ప్రయాణికులకు వేగవంతమైన, రైలు-రోడ్డు-పర్యాటక ప్రాంతాలను అనుసంధానం చేసేలా రైల్వే ప్రాజెక్టులకు రూపకల్పన చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులను కోరారు. రాష్ట్రంలోని పెండింగ్ రైల్వే ప్రాజెక్టులు, కొత్త ప్రతిపాదనలకు సంబంధించి దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవతోపాటు రాష్ట్ర ఉన్నతాధికారులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి గురువారం పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమీక్షించారు. వివరాలు సీఎం మాటల్లోనే.... పెండింగ్‌లో ఉన్న రైలు ప్రాజెక్టులు, లైన్లను వేగవంతంగా పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుంది. అవసరమైన నిధులను సమకూర్చటంతోపాటు భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రాజెక్టుల అలైన్‌మెంట్లు ఉండాలి. దూరాభారం తగ్గించి, అంచనా ఖర్చును కూడా తగ్గించుకోవాలి. రాష్ట్ర పునర్విభజన చట్టంలోని హామీ ప్రకారం హైదరాబాద్ నుంచి అమరావతికి ర్యాపిడ్ రైల్ అండ్ రోడ్డు కనెక్టివిటీ ప్రాజెక్టును కేంద్రం అమలు చేయాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్న ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందర్ వరకు 12 లేన్ల గ్రీన్‌ఫీల్డ్ హైవే ఏర్పాటు చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశాం. అందుకు సంబంధించి 300 కిలోమీటర్ల అలైన్‌మెంట్ ప్రతిపాదనలను కూడా రాష్ట్ర ప్రభుత్వం తయారు చేసింది. దానికి అనుగుణంగా రైల్వేలైన్ ఏర్పాటు చేయాలి. రైల్వే విభాగ పరిశీలనలో ఉన్న అన్‌లైన్‌మెంట్‌తోపాటు రాష్ట్ర - మిగతా 2లో



## రాష్ట్రపతికి, గవర్నర్లకు గడువు సరి కాదు

- ఆర్టికల్ 200 ప్రకారం నిర్ణయం తీసుకునే సౌలభ్యం వారికే కల్పించాలి
- 50 ఏళ్లలో 90 శాతం బిల్లులకు నెలరోజుల్లోనే గవర్నర్ల ఆమోదం
- సుప్రీంలో కేంద్ర ప్రభుత్వ వాదనలు.. తీర్పు వాయిదా వేసిన ధర్మాసనం

3



## మారిషస్‌కు రూ,5,984 కోట్ల సాయం

- ఏడు ఒప్పందాలపై సంతకం
- ఇకపై స్థానిక కరెన్సీలో వాణిజ్యం: మోదీ
- వారణాసిలో ఆ దేశ ప్రధానితో భేటీ
- గత మే నెలలో డీగో గార్షియాతోపాటు చాగోస్ ద్వీపాలను బ్రిటన్ మారిషస్‌కు అప్పగిస్తూ నిర్ణయం

# ఆర్ఆర్ఆర్ చుట్టూరా
# రీజనల్ రింగ్ రైల్



- 45 మీటర్ల వెడల్పుతో రైలు మార్గం.. రూ.25 వేల కోట్ల వ్యయం
- రాష్ట్ర ప్రభుత్వానికి వివరాలు తెలిపిన రైల్వే అధికారులు
- తొలుత ఆర్ఆర్ఆర్‌కు 10 కి.మీ. దూరంలో నిర్మాణానికి యోచన
- తాజాగా ట్రిపుల్ ఆర్ పక్కనే నిర్మించాలని కేంద్రం, రాష్ట్రం నిర్ణయం
- 350 కి.మీ వేగంతో హైదరాబాద్ నుంచి చెన్నై, బెంగళూరుకు రైళ్లు
- భారీ వ్యయంతో రెండు కారిడార్లను నిర్మించనున్న కేంద్రం

**సూర్య హైదరాబాద్**

తెలంగాణకు కేంద్రం మంజూరు చేసిన రీజినల్ రింగు రైలు అలైన్‌మెంట్ మారింది. రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) కు 10 కిలోమీటర్ల దూరంలో నిర్మించాలని తొలుత అనుకున్నప్పటికీ.. ఈ రైలు మార్గాన్ని రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్)కు పక్కనే నిర్మించాలనే నిర్ణయానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వచ్చాయి. ఈమేరకు.. మార్చిన రైలు మార్గం అలైన్‌మెంట్‌పై గురువారం సీఎం రేవంత్ కేంద్ర రైల్వే శాఖ ఉన్నతా?ధికారులతో కలిసి సమీక్షించారు. రాష్ట్రానికి రింగు రైలు మంజూరైనప్పుడు - మిగతా 2లో

## డబ్బులిచ్చి నాపై దుష్ప్రచారం

- ఆ ప్రచారం వెనుక పెట్రోల్ లాబీ.. రాజకీయంగా లక్ష్యం చేసుకున్నారు
- ఇథనాల్‌తో కూడిన పెట్రోల్ వల్ల మైలేజీ తగ్గుతుందన్నది అవాస్తవం :
- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

3

# బస్తా కోసం భారంగా..

- యూరియా కోసం గంటలతరబడి ఎదురుచూస్తున్న రైతులు
- టోకెన్ల కోసం మహిళా రైతుల తోపులాట..ఒకరికి గాయాలు
- మఠంపల్లిలో పీఏసీఎస్ డైరెక్టర్‌ల రాజీనామా..
- రైతుల కోసం యూరియా లారీ నడిపిన కానిస్టేబుల్
- ఎక్కువ మాట్లాడితే కేసులు పెడతామంటూ ఏఈఓలు బెదిరించారన్న రైతులు



**సూర్య హైదరాబాద్**

యూరియా కోసం రైతుల ఆందోళనలు రోజురోజుకూ తీవ్రతరం అవుతున్నాయి. టోకెన్ల కోసం, యూరియా లారీల కోసం ఎదురుచూపులు నిత్యకృత్యం అయ్యాయి. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర పీఏసీఎస్ కేంద్రం వద్ద టోకెన్లు ఉన్న రైతులకు యూరియా - మిగతా 2లో



# అంగట్లో గ్రూప్ -1 పోస్టులు

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- హైకోర్టు ఆదేశాల మేరకు గ్రూప్-1 పరీక్ష మళ్లీ నిర్వహించాలి
- మంత్రుల వసూళ్లపై వస్తున్న ఆరోపణలపై విచారణ చేపట్టాలి

**సూర్య హైదరాబాద్**

కాంగ్రెస్ మంత్రులు గ్రూప్-1 పోస్టులను అంగట్లో పెట్టి అమ్ముకుంటున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఈ విషయంలో మంత్రులు, సీఎం కార్యాలయంపై వస్తున్న ఆరోపణలను నిగ్గు తేల్చాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి కష్టపడి, తమ విలువైన సమయాన్ని, తల్లిదండ్రుల కష్టార్జితాన్ని వెచ్చించి పోటీ పరీక్షలు రాసే తెలంగాణ యువత నమ్మకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం వమ్ము చేసిందని గురువారం ఆయన ఒక ప్రకటనలో తీవ్రంగా విమర్శించారు. హైకోర్టు ఆదేశాల మేరకు గ్రూప్-1 పరీక్షను అక్రమాలకు తావులేకుండా తాజా నోటిఫికేషన్ వేసి మళ్లీ నిర్వహించాలన్నారు. పరీక్షల్లో జరిగిన అవకతవకలపై జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు చేసి ఉద్యోగాలు అమ్ముకున్న దొంగలెవరో తేల్చాలని ఆయన డిమాండ్ చేశారు. గ్రూప్-1 పరీక్షల నిర్వహణలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థతతో పాటు ఆ పార్టీ నేతల కాసుల కక్కుర్తి వల్లే గ్రూప్-1 పరీక్షలో అవకతవకలు చోటు చేసుకున్నాయని అన్నారు. తమ ప్రభుత్వ హయాంలో ఉద్యోగాల భర్తీ ప్రక్రియ పారదర్శకంగా జరిగిందన్నారు. ఏడాది లోపే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని - మిగతా 2లో

# ఓట్ చోరీ ఆరోపణల్లో
# విదేశీ హస్తం

- రాహుల్ డాక్యుమెంట్లు 'మేడిన్ ఇండియా' కాదు
- అన్నీ మయన్మార్ టైమ్ జోన్‌తో ఉన్నాయ్: బీజేపీ
- "ఆందోళన చెందుతున్న బీజేపీ నేతలకు చెబుతున్నా.. ఆందోళన పడొద్దు
- 'హైడ్రోజన్ బాంబ్' వచ్చినప్పుడు, ప్రతీది స్పష్టంగా వెల్లడవుతుంది"

3



# ఆర్‌ఆర్‌ఆర్ చుట్టూరా రీజనల్ రింగ్ రైల్

-మొదటిపేజీ తరువాయి

అనుకున్న అలైన్‌మెంట్.. ఇప్పుడు రింగు రోడ్డు పక్కనే రైలును నిర్మించేందుకు రూపొందించిన ప్రాథమిక అలైన్‌మెంట్ల వివరాలను రైల్వే అధికారులు సీఎంకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ రూపంలో తెలియజేశారు. తాజాగా రూపొందించిన అలైన్‌మెంట్ ప్రకారం రీజినల్ రింగు రోడ్డు పక్కనే రైలు మార్గాన్ని నిర్మించేందు కు 45 మీటర్ల వెడల్పుతో భూమి కావాలని తెలిపారు. అలాగే 362 కిలోమీటర్ల మేర రైలుమార్గం ఉంటుందని, ఈ మధ్యలో దాదాపు 19 స్టేషన్లు వస్తాయని వివరించారు. రైలు మార్గం, స్టేషన్ల నిర్మాణం, భూసేకరణ పరిహారం.. వీటన్నింటికీ కలిపి దాదాపు రూ.25,550 కోట్ల వరకూ ఖర్చవుతుందని వెల్లడించారు. ప్రస్తుత ం తెలంగాణ, హైదరాబాద్ మీదుగా వెళ్తున్న రైలు మార్గాల్లో సుమారు 6 మార్గాలకు సంబంధించిన స్టేషన్లు కూడా దీంతో అనుసంధానమవుతాయని పేర్కొన్నారు. రింగు రైలు మార్గం కోసం 4030 ఎకరాలు, రైల్వే స్టేషన్ల నిర్మాణం కోసం 1090 ఎకరాలు, ఇతర రైలు మార్గాల కనెక్టివిటీల కోసం 937 ఎకరాలు.. ఇలా మొత్తం 6 వేల ఎకరాల భూమి అవసరం అవుతుందని తెలిపారు.



**ఆ 45 మీటర్ల భూమి సర్దుబాటు ఎలా?**

రింగు రోడ్డు పక్కనే రైలు నిర్మాణానికి అవసరమైన 45 మీటర్ల భూమి విషయమే సందిగ్ధంగా మారింది. రింగు రోడ్డు ఉత్తరభాగం నిర్మాణానికి అవసరమై భూమిలో దాదాపు భూ సేకరణ చివరిదశకు చేరింది. దక్షిణభాగంలో ఇంకా భూ సేకరణ ప్రారంభంకాలేదు. కాబట్టి ఈ భాగంలో రో డ్డు, రైలు మార్గాలకు అవసరమైన మేరకు భూమిని సేకరించుకునే అవకాశం ఉంది. ఇప్పుడు ఉత్తరభాగం వైపు రైలు మార్గానికి అవసరమైన భూ మిని ఎలా సర్దుబాటు చేయాలనేదానిపైనే ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఈ మార్గంలో రోడ్డు కోసం ఇప్పటికే 100 మీటర్ల వెడల్పుతో భూమిని సేకరించారు, మళ్లీ ఇప్పుడు దీనికి అదనంగా 45మీటర్లను సేకరించేందుకు ఉన్న అవకాశాలు, ఏర్పాట్లపై సమాలోచనలు చేస్తోంది.

**హైస్పీడ్ రైళ్లు..**

హైదరాబాద్ మీదుగా చెన్నై, బెంగళూరు వరకు వేర్వేరుగా రెండు హై స్పీడ్ రైల్ కారిడార్లను నిర్మించాలని కేంద్రం నిర్ణయించిన నేపథ్యంలో.. ఆ వివరాలను కూడా అధికారులు గురువారం సీఎం రేవంత్‌కు తెలిపారు. ఆ రైళ్లు గంటకు 350 కి.మీ వేగంతో నడిచేలా ట్రాక్ నిర్మిస్తామని.. 320 కిలోమీటర్ల వేగంతో రైళ్లు నడుస్తాయని తెలిపారు. హైదరాబాద్–బెంగళూరు కారిడార్ మొత్తం పొడవు 576 కిలోమీటర్లు కాగా.. అందులో 218 కిలోమీటర్లు తెలంగాణ పరిధిలో ఉంటాయని, మొత్తం మూడు స్టేషన్లు వస్తాయని, దాదాపు 705 హెక్టార్ల భూమి అవసరమని, ఈ కారిడార్ నిర్మాణానికి రూ.1.75 లక్షల కోట్లను వెచ్చించనున్నామని రైల్వే అధికారులు వెల్లడించారు. అలాగే హైదరాబాద్–చెన్నై మార్గం మొత్తం పొడవు 744 కిలోమీటర్లు కాగా తెలంగాణ పరిధిలో 236 కిలోమీటర్లు ఉంటాయని.. మొత్తం 5 స్టేషన్లు వస్తాయని, దీనికోసం 790 హెక్టార్ల భూమి అవసరమని, ఈ కారిడార్ నిర్మాణానికి సుమారు రూ.2.24లక్షల కోట్ల వరకు ఖర్చవుతుందని తెలిపారు. ఈ రెండు కారిడార్లనూ కేంద్రమే నిర్మించనుంది. అయితే ఈ రెండింటి అలైన్‌మెంట్ల విషయంలో సీఎం రేవంత్ కీలక సూచనలు చేసినట్టు సమాచారం. హైదరాబాద్–బెంగళూరు మార్గాన్ని శంషాబాద్, మహబూబ్‌నగర్, శ్రీశైలం మీదుగా తీసుకెళ్తే శ్రీశైలానికి రైల్వే మార్గం ఏర్పడుతుందని.. తద్వారా తెలంగాణ నుంచి అక్కడికి వెళ్లే భక్తులకు ఉపయుక్తంగా ఉంటుందని సూచించినట్టు తెలిసింది. అలాగే హైదరాబాద్–చెన్నై కారిడార్ అలైన్‌మెంట్‌ను శంషాబాద్–బాటసింగారం–నార్కట్‌పల్లి–సూర్యాపేట–ఖమ్మం–అమరావతి–గుంటూరు మీదుగా కేంద్ర రైల్వే అధికారులు రూపొందించారు. అయితే ఇప్పటికే నార్కట్‌పల్లి, ఖమ్మం, విజయవాడ వైపు రైలు మార్గాలు ఉన్నందున హైదరాబాద్–అమరావతి మధ్యన ప్రతిపాదిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ రోడ్డుకు సమాంతరంగా నిర్మిస్తే చాలావరకూ కొత్త ప్రాంతాలకు రైలు కనెక్టివిటీ ఏర్పడుతుందని, తద్వారా కొత్తగా వ్యాపార లావాదేవీలకు అవకాశం ఉంటుందని సీఎం అభిప్రాయపడినట్టు సమాచారం. పైగా ఈ మార్గాన్ని బందరు పోర్టు వరకు నిర్మించడం వలన తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న డ్రై పోర్టుకు రైలు కనెక్టివిటీ ఏర్పడుతుందని వెల్లడించినట్టు తెలిసింది. సీఎం సూచనలను పరిశీలిస్తామని రైల్వే అ?ధికారులు చెప్పినట్టు సమాచారం.

**రాష్ట్రంలో మరికొన్ని ప్రాజెక్టుల వివరాలు..**

కేంద్రం నుంచి తెలంగాణకు మంజూరైన కొన్ని రైల్వే లైన్ల వివరాలను కూడా అధికారులు సమీక్షలో సీఎంకు తెలిపారు. అవేంటంటే..

వికారాబాద్–కృష్ణా మార్గం.. 130 కిలోమీటర్లు.. నిర్మాణ ఖర్చు రూ.2,784.11 కోట్లు. ఈ రూట్‌లో పరిగి, కొడంగల్, టేకల్‌కోడే, మాటూర్, బాలంపేట, అన్నాసాగర్, నారాయణపేట, మక్తల్‌లో స్టేషన్లు రానున్నాయి.

డోర్నకల్– గద్వాల మార్గం.. 296 కిలోమీటర్లు. నిర్మాణ ఖర్చు రూ.5,920 కోట్లు.

డోర్నకల్–మిర్యాలగూడ రూట్ 97.45 కిలోమీటర్లు కాగా.. నిర్మాణ వ్యయం రూ.2,184 కోట్లు.

కల్వకుర్తి– మాచర్ల రూట్.. 126 కిలోమీటర్లు. నిర్మాణ వ్యయం రూ.2,520 కోట్లు. అలాగే అమృత్ భారత్ పథకం కింద దేశవ్యాప్తంగా చేపట్టిన రైల్వే స్టేషన్ల అభివృద్ధిలో భాగంగా రాష్ట్రంలో రూ.2,760 కోట్లతో 40 స్టేషన్లను అభివృద్ధి చేయనున్నామని, ఇప్పటికే బేగంపేట, కరీంనగర్, వరంగల్ స్టేషన్ల పనులు పూర్తయ్యాయని రైల్వే శాఖ ఉన్నతాధికారులు తెలిపారు. సికింద్రాబాద్, హైదరాబాద్ స్టేషన్ల కోసమే దాదాపు రూ.1,042 కోట్లను, లింగంపల్లి, కాచిగూడ స్టేషన్ల కోసం 802.88 కోట్లను, మిగిలిన 36 స్టేషన్ల కోసం 915.27 కోట్లను వెచ్చించనున్నట్టు తెలిపారు.

# బస్తా కోసం భారంగా..

-మొదటిపేజీ తరువాయి

పంపిణీ చేస్తుండగా, టోకెన్లు లేని రైతులు పెద్ద ఎత్తున అక్కడకు చేరడంతో పరిస్థితి గందరగోళంగా తయారైంది. ఒక్కసారిగా రైతులు ఎగబడ్డారు. మహిళా రైతుల అరుపులు, కేకలతో తోసుకున్నారు. ఈ తరుణంలో నార్లోనికుంట్ల సత్యమ్మ, డోకూర్ బాలకిష్టమ్మ ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. సత్యమ్మ చెవికి తీవ్ర గాయమైంది.

' సూర్యాపేట జిల్లా మఠంపల్లి పీఏసీఎస్‌కు చెందిన నలుగురు డైరెక్టర్లు యూరియా కొరతకు నిరసనగా రాజీనామా చేశారు. తమ గ్రామాల్లోని రైతులకు యూరియా అందజేయలేకపోతున్నామన్న మనస్తాపంతో రాజీనామా చేస్తున్నట్లు డైరెక్టర్లు గోలి చంద్రం, పట్టేటి ఆంథోని, వల్లపుదాస్ చినలింగయ్యగౌడ్, పశ్యా రామనరసమ్మ చెప్పారు.

' మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలోని ఉప్పరపల్లి, కల్వల గ్రామాల్లో సొసైటీ పాయింట్ వద్ద రైతులు గురువారం తెల్లవారుజామునే క్యూలో నిల్చున్నారు. ఉదయం 7 గంటలకే యూరియా లోడ్ లారీ రావాల్సి ఉండగా 11 గంటలైనా రాలేదు. కేసముద్రం విలేజ్ దర్గా వద్ద ఆ డ్రైవర్ యూరియా లోడ్ లారీ తీసుకొచ్చి నిలిపాడని పోలీసులు తెలుసుకున్నారు.

దర్గా నుంచి ఉప్పరపల్లి వరకు లారీని తీసుకెళ్లి 220 బస్తాలను సెంటర్‌లో దింపించారు. ఆ తర్వాత కల్వల సెంటర్‌కు లారీని తీసుకెళ్లాల్సి ఉండగా, అప్పటికే లారీడ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. దీంతో బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ ఎండీ అలీమ్ ఆ లారీని తానే డ్రైవింగ్ చేసి కల్వలకు తీసుకొచ్చాడు. ఆ తర్వాత 220 బస్తాలను రైతులకు పంపిణీ చేశారు.

' వరంగల్ జిల్లా ఖానాపురం మండలంలోని గొల్లగూడెంతండాకు చెందిన తేజావత్ శ్రీను ఆరు ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశాడు. సరిపోను యూరియా లభించకపోవడంతో ఐదు ఎకరాల్లో మొక్కజొన్న పంటను వదిలేశాడు. దీంతో పంటను గురువారం గొర్రెల కాపరులకు అప్పగించడంతో అవి మేశాయి.



కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సిరిసిల్ల రోడ్‌లో ధర్నా చేస్తున్న రైతులు



సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని రైతు వేదిక వద్ద

## ప్రతిష్ఠాత్మకంగా బీసీ డిక్లరేషన్ సభ

### జన సమీకరణ, ఏర్పాట్లపై చర్చ

హైదరాబాద్

ఈనెల 15న కామారెడ్డిలో నిర్వహించనున్న బీసీ డిక్లరేషన్ బహిరంగ సభను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని విజయవంతం చేసే విషయమై మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, సీతక్క, వాకిటి శ్రీహరి ముదిరాజ్, వివేక్ వెంకటస్వామి తదితరులు గురువారం నగరంలోని మంత్రుల నివాస సముదాయంలో భేటీ అయ్యారు. పొంగులేటి నివాసంలో జరిగిన ఈ సన్నాహక సమావేశానికి ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు తదితరులు హాజరయ్యారు. కామరెడ్డి సభకు జన సమీకరణ, ఇతర ఏర్పాట్లపై సుదీర్ఘంగా చర్చించారు. "ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటకు కట్టుబడి రాష్ట్రంలో బీసీల అభ్యున్నతికి కృషి చేస్తున్నాం. విద్య, ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీ చేసిన కృషిని సభ ద్వారా ప్రజలకు వివరిద్దాం. అదే విధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు సభను సద్వినియోగం చేసుకుందాం. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కాంగ్రెస్ కృషి చేస్తుంటే.. భాజపా, భారత రాష్ట్ర సమితిలు అడ్డుకుంటున్న తీరును, ఆ పార్టీల కుట్రలను సభ ద్వారా రాష్ట్ర ప్రజలకు తెలియజేయాలి" అని మంత్రులంతా సమష్టిగా అభిప్రాయపడ్డారు. కామారెడ్డికి సమీపంలో ఉన్న అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున జన సమీకరణ చేయాలని నిర్ణయించారు.

## పెండింగ్ రైల్వే ప్రాజెక్టుల పూర్తికి సంపూర్ణ సహకారం

-మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వం సిద్ధం చేసిన అలైన్‌మెంట్‌ను పరిశీలించి భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ముందుకు వెళ్లాలి. హైవే వెంట రైలుమార్గం ఉండాలి, హైవేకు ఇరువైపులా కిలోమీటరన్నర దూరం వరకు ఇండ్రస్టియల్ కారిడార్‌ను విస్తరించాలనే ప్రతిపాదనలున్నాయి.

కొత్తగా అభివృద్ధి చేస్తున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్రతిపాదనలకు అనుగుణంగా హైదరాబాద్%–%చెన్నై, హైదరాబాద్%–%బెంగుళూరు హైస్పీడ్ రైలు ప్రాజెక్టుల సర్వే, అలైన్‌మెంట్ ప్రతిపాదనలను మరోసారి పరిశీలించాలి. ప్రయాణికులకు వేగవంతమైన రవాణా సదుపాయాలు అందించటంతోపాటు కొత్తగా వేసే రైలు మార్గాలన్నీ ఆయా ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధికి ఉపయోగపడేలా ఉండాలి. విదేశాల తరహాలో రైలు, రోడ్డు, పోర్ట్ కనెక్టివిటీని అధునాతనంగా అభివృద్ధి చేయాలి. వికారాబాద్%–% కృష్ణా కొత్త రైల్వే లైన్ పనులను వీలైనంత త్వరగా చేపట్టాలి. గద్వాల%–%డోర్నకల్ రైల్వే లైన్ పనుల డీపీఆర్ పూర్తి చేసి వేగంగా పనులు చేపట్టాలి. వరంగల్‌లోనూ రైల్వే లైన్లను అభివృద్ధి చేయాలి. భూపాలపల్లి నుంచి వరంగల్ కొత్త మార్గాన్ని పరిశీలించాలి. కాజీపేట జంక్షన్‌లో ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాలి. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా హైదరాబాద్‌తోపాటు వరంగల్‌ను అభివృద్ధి చేయాలి. అందుకు అనుగుణంగా రైల్వే ప్రాజెక్టులను చేపట్టాలి'అని ముఖ్యమంత్రి రైల్వే అధికారులకు సూచించారు.

## అంగట్లో గ్రూప్ -1 పోస్టులు

-మొదటిపేజీ తరువాయి



ఎన్నికల సమయంలో కాంగ్రెస్ చేసిన మోసపూరిత వాగ్దానాలపై ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేసి చర్చించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ సమస్య తీవ్రతను ప్రభుత్వం గుర్తించాలని, కేవలం మాటలతో కాకుండా చేతల్లో చూపించి యువత ఆశలను నెరవేర్చాలని కేటీఆర్ సూచించారు.

**కేటీఆర్‌కు 'గ్రీన్ లీడర్‌షిప్'అవార్డు**

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు అరుదైన అంతర్జాతీయ గౌరవం లభించింది. సుస్థిర పాలన, పర్యావరణ పరిరక్షణలో చేసిన కృషికిగాను ప్రతిష్టాత్మకమైన 'గ్రీన్ లీడర్‌షిప్ అవార్డు 2025'కు ఆయన ఎంపికయ్యారు. ఈ నెల చివరిలో అమెరికాలోని న్యూయార్క్‌లో ఈ అవార్డును ప్రదానం చేయనున్నారు. సెప్టెంబర్ 24న న్యూయార్క్‌లో జరగనున్న 9వ ఎన్‌వైసీ గ్రీన్ స్కూల్ కాన్ఫరెన్స్‌లో ఈ అవార్డు ప్రదానోత్సవం జరగనుంది.

**నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం**

**మాజీ మంత్రి హరీశ్‌రావు**

గ్రూప్%–%1 పరీక్షను తిరిగి నిర్వహించాలని డిమాండ్ చేస్తూ అశోక్ నగర్ సెంట్రల్ లైబ్రరీతో పాటు ఇతర ప్రాంతాల్లో ఆందోళన చేపట్టిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేయడాన్ని మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని ఆయన గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గ్రూప్%–%1 పరీక్షను మళ్లీ నిర్వహించాలని అన్నారు. 'కాంగ్రెస్ ప్రభుత్వం పరీక్షలను సక్రమంగా నిర్వహించలేక విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతోంది. డైవర్షన్ రాజకీయాలతో గ్రూప్%–%1 పరీక్షలో అవినీతి, అవకతవకలను కప్పిపుచ్చాలనే ప్రభుత్వ ఆటలు సాగవు. గ్రూప్%–%1 పరీక్షలో జరిగిన అక్రమాలపై వెంటనే సమగ్ర దర్యాప్తు చేపట్టాలి. ఎన్నికల సమయంలో విద్యార్థులు, నిరుద్యోగులను రెచ్చగొట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన అసమర్థతను ఒప్పుకొని క్షమాపణ చెప్పాలి'అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగుల ఆకాంక్షలను నీరుగార్చి, వారి భవిష్యత్తుతో ఆటలాడుతోందని ఆయన విమర్శించారు.

**గ్రూప్%–%1 పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలి**

**బీఆర్ఎస్‌వీ నేతల డిమాండ్**

గ్రూప్%–%1 పరీక్షను రద్దుచేసి మళ్లీ నిర్వహించాలని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, ఉపాధ్యక్షుడు తుంగబాలు డిమాండ్ చేశారు. గురువారం చిక్కడపల్లి నగర కేంద్ర గ్రంథాలయం ముందు గ్రూప్%–%1 పరీక్ష మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగ అభ్యర్థులతో కలసి ఆందోళన కార్యక్రమం చేపట్టారు. దీంతో నిరసనలో పాల్గొన్న వారిని చిక్కడపల్లి పోలీసులు అరెస్టుచేసి అబిడ్స్, ముషీరాబాద్ పోలీసుస్టేషన్లకు తరలించారు.

గెల్లు శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ గ్రూప్%–%1 పరీక్షల్లో జరిగిన అవకతవకలకు ప్రభుత్వం బాధ్యత వహించాలని, దీనిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. తెలుగు మీడియం విద్యార్థులకు పేపర్ వాల్యుయేషన్లో తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ప్రస్తుత నోటిఫికేషన్ రద్దు చేయాలని, తప్పుచేసిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తుంగబాలు మాట్లాడుతూ గ్రూప్%–%1 పరీక్షను నిర్వహించడంలో విఫలమైనందున, నైతిక బాధ్యత వహిస్తూ చైర్మన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

## ఆ వార్తలన్నీ ఊహాగానాలే

**జూబ్లీహిల్స్‌లో నేను పోటీ చేయట్లేదు**

**ఎవరికి టికెటిచ్చినా గెలుపే లక్ష్యంగా పని చేస్తా**

**ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్**



బంజారాహిల్స్

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో తాను పోటీ చేస్తున్నానంటూ వస్తున్న వార్తలన్నీ ఊహాగానాలేనని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పేర్కొన్నారు. జూబ్లీహిల్స్‌లో పోటీ విషయమై తనకు ఎలాంటి సమాచారం లేదని స్పష్టం చేశారు. ఆదర్శనగర్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో గురువారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. అనంతరం దానం మాట్లాడుతూ అభ్యర్థి ఎంపికపై కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందని, అందులో ఎవరి ప్రమేయమూ ఉండదని అన్నారు. పార్టీ ఎవరికి టికెట్ ఇచ్చినా.. వారి గెలుపే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కాంగ్రెసకు జూబ్లీహిల్స్ గెలవడం చాలా అవసరమని, ఇందుకోసం సర్వశక్తులు ఒడ్డుతానని చెప్పారు. ఫిరాయింపులపై ప్రశ్నించగా... అది కోర్టు పరిధిలో ఉన్నందున ప్రస్తుతం మాట్లాడబోనని స్పష్టం చేశారు.


# సంపాదకీయం

## మొఘల్ సామ్రాజ్యంలో బీజాపూర్ విలీన నేపథ్యం

చరిత్ర పుటలను తిరగ వేస్తే సెప్టెంబర్, 12వ తేదీన అదిల్ షాహీ వంశం పతనమైన ఘటన కన్పిస్తుంది. ఔరంగజేబుతో 1686వ సంవత్సరంలో జరిగిన యుద్ధంలో బీజాపూరు రాజ్యం ఓడిపోయింది. దానితో మొఘల్ సామ్రాజ్యంలో కలిసిపోయింది. ఆదిల్షా షాహీ వంశము పతనమైంది. ఆదిల్‌షాహీ వంశము 1490 నుండి 1686 వరకు బీజాపూరు కేంద్రంగా దక్కన్ పీఠభూమి యొక్క పశ్చిమ ప్రాంతాన్ని ఏలిన షియా ముస్లిం సుల్తానుల వంశము. బీజాపూరు 1347 నుండి 1518 వరకు బహమనీ సుల్తానుల రాజధానిగా ఉంది. 15వ శతాబ్దం చివరలో ఈ సామ్రాజ్యం క్షీణించి, తుదకు 1518లో అంతరించిపోయింది. బహమనీ సుల్తానుల సామంతులుగా ఉన్న ఆదిల్ షాహీలు బహమనీ సామ్రాజ్య పతనం తరువాత స్వతంత్ర రాజులైనారు. ఆదిల్‌షాహీ వంశపు స్థాపకుడు యూసుఫ్ ఆదిల్‌షా. బీజాపూరు సుల్తాన్ 1686, సెప్టెంబరు 12న ఔరంగజేబుతో యుద్ధంలో ఓడిపోయి, మొఘల్ సామ్రాజ్యంలో కలిసిపోయింది. 1620లో రెండవ ఇబ్రహీం ఆదిల్‌షా పాలనలో బీజాపూర్ స్వతంత్ర రాజ్యంగా కాక ముందు ఈ వంశ వ్యవస్థాపకుడు యూసఫ్ ఆదిల్ షా (1490–1510), బీజాపూర్ రాజ్య విభాగానికి గవర్నర్ గా నియమింప బడ్డాడు. యూసఫ్ ను, ఆయన కొడుకు ఇస్మాయిల్ ను ఆదిల్ ఖాన్ బిరుదుతో వ్యవహరించే వారు. ఖాన్ అంటే పర్షియన్, మంగోలియన్ భాషల్లో నాయకుడు అని అర్థం. షా బిరుదు కన్నా తక్కువ స్థాయి కలిగినదే అయినా ఖాన్ అనేది రాచ మర్యాద కలిగిన బిరుదు. యూసఫ్ మనవడు ఇబ్రహిం ఆదిల్ షా 1 (1534%–%1558), తో “ఆదిల్ షా” బిరుదు సామాన్య వాడుకలోకి వచ్చింది. బీజాపూర్ సుల్తానుల సరిహద్దులు కాలానుగుణంగా మారుతూ వచ్చాయి. ఈ రాజ్య ఉత్తరపు టెల్లలు ఎప్పుడూ స్థిరంగానే ఉన్నాయి. ప్రస్తుత దక్షిణ మహారాష్ట్ర నుంచి ఉత్తర కర్ణాటక వరకూ ఈ రాజ్యం విస్తరించి ఉండేది. రాయచూరు అంతర్వేది ప్రాంతాన్ని గెలవడంతో దక్షిణం వైపు వారి విస్తరణ ప్రారంభమైంది. 1565లో తళ్ళికోట యుద్ధంలో గెలుపుతో విజయనగర సామ్రాజ్యాన్ని గెలుచుకుని ఇంకా దక్షిణానికి జరిగారు. మొహమద్ ఆదిల్ షా (1627–1657), తరువాతి దండయాత్రలతో బీజాపూర్ అధికారపు సరిహద్దు మరింత దక్షిణాన ఉన్న బెంగళూరు వరకూ వచ్చాయి. పశ్చిమాన పోర్చుగీస్ పరిపాలనలో ఉన్న గోవా, తూర్పున కుతుబ్ షాహీ వంశం పాలిస్తున్న గోల్కొండ రాజ్యం వరకూ బీజాపూర్ రాజ్యం విస్తరించి ఉండేది. బహమనీ ప్రావిన్సు రాజధాని అయిన బీజాపూర్ నే వీరు కూడా చివరి వరకూ రాజధానిగా కొనసాగించారు. ఇబ్రహీం ఆదిల్ షా × (1534–1558), అలీ ఆదిల్ షా (1558–1579) బీజాపూర్ నగరాన్ని పునర్నిర్మించారు. వీరిద్దరి పరిపాలనా కాలంలో నగరానికి ప్రహారీ, కాంగ్రిగేషన్ మసీదు, రాజభవనాలు, ప్రధాన నీటి సరఫరా మౌలిక సదుపాయాల నిర్మాణాలు చేపట్టారు. వారి వారసులు అయిన ఇబ్రహం ఆదిల్ షా (1580–1627), ఆదిల్ షా (1627–1657), అలీ ఆదిల్ షా (1657–1672) లు బీజాపూర్ ను సుందరమైన రాజభవనాలు, మసీదులు, సమాధులు, ఇతర కట్టడాలతో మరింత అలంకరించారు. దక్కన్ సుల్తనేట్, ఇండో – ఇస్లామిక్ నిర్మాణ శైలికి అత్యుత్తమ ఉదాహరణాలలో ఒకటిగా నిలిచింది బీజాపూర్ నగరం. బహమనీ సామ్రాజ్యం పతనం కావడంతో బీజాపూర్ లో అస్థిరత నెలకొంది. విజయనగర సామ్రాజ్యం, ఇతర దక్కన్ సుల్తానేట్‌లతో నిరంతర యుద్ధాల కారణంగా రాజ్యంలో అభివృద్ధి క్షిణించింది. దక్కన్ సుల్తానేట్ మిత్ర రాజ్యాలన్నీ కూటమిగా కలసి 1565లో తళ్ళికోటలో విజయనగర రాజుల్ని ఓడించి, సామ్రాజ్యాన్ని గెలుచుకున్నారు. బీజాపూర్ ఎన్నో ప్రయత్నాల తరువాత ఆఖరుకి పొరుగు సుల్తా నేట్ అయిన బీదర్‌ను 1619లో గెలుచుకున్నారు. పోర్చుగీస్ సామ్రాజ్యం గోవాలోని ఆదిల్ షాహికు చెందిన రేవు పట్టణంపై తీవ్ర ఒత్తిడి కొనసాగించే వారు. ఈ రేవుపై పోర్చుగీస్ వారు పెత్తనం చెలాయించేవారు. ఆఖరుకు ఇబ్రహిం పరిపాలనా కాలంలో ఆ రేవు పట్టణాన్ని పోర్చుగీస్ వారు గెలుచు కున్నారు. ఛత్రపతి శివాజీ తిరుగుబాటుతో కొంత ఇబ్బంది ఎదుర్కున్నా, కొన్నాళ్ళు బీజాపూర్ రాజ్యం స్థిరంగానే కొనసాగింది. శివాజి తండ్రి షాజీ బోన్స్ లే ఆదిల్ షా పాలనలో మరాఠా ప్రాంతానికి ప్రధాన సేనాధిపతిగా పనిచేశాడు. తరువాతి కాలంలో శివాజీ మరాఠా ప్రాంతాన్ని గెలుచుకుని స్వతంత్ర మరాఠా సామ్రాజ్యాన్ని స్థాపించాడు. బ్రిటీష్ సామ్రాజ్యానికి ముందు మరాఠా సామ్రాజ్యం భారతదేశంలోని అతిపెద్ద సామ్రాజ్యంగా నిలిచింది. 16వ శతాబ్దం చివరి భాగంలో బీజాపూర్ సామ్రాజ్యానికి మొఘల్ సామ్రాజ్యం దక్కన్ ప్రాంతంలో విస్తరణ ప్రారంభం వల్ల అతిపెద్ద ముప్పు మొదలైంది. శివాజీ తిరుగు బాటుతో బలహీనపడిన బీజాపూర్ సామ్రాజ్యంపై మొఘల్ రాజులు సులువుగా అదుపు సంపాదించ గలిగారు. ఆదిల్ షాహీ సామ్రాజ్యంపై వివిధ ఒప్పందాలు విధించడం ద్వారా మొఘలులు బీజాపూర్ లో విదేశీ పరిపాలన చేయడం ప్రారంభించారు. కొన్ని దశల అనంతరం 1636లో బీజాపూర్ రాజ్యం అధికారికంగా మొఘలుల అధీనంలోకి పాక్షికంగా వెళ్ళిపోయింది. 1686లో బీజాపూర్ రాజ్యాన్ని ఆక్రమించు కోవడానికి ముందు నుంచీ ఆదిల్ షాహీల ఖజానాను ఖాళీ చేస్తూ వచ్చారు మొఘలులు. వాస్తవానికి 13వ శతాబ్దం ఆఖరి కాలంలో జిల్లాభూభాగం ఖిల్జీ సుల్తానేట్, ఢిల్లీ సుల్తానేట్ లోకి చేర్చబడింది. 1347లో జిల్లా భూభాగాన్ని గుల్బర్గాకు చెందిన బహ్మనీ సుల్తానులు ఆక్రమించు కున్నారు. ఈ సమయంలో విజయపూర్ బీజపూర్ అని పిలువబడింది. 1518లో బహ్మనీ సుల్తానేట్ ఐదు రాజాస్థానాలుగా (దక్కన్ సుల్తానేట్‌గా) విభజించబడింది. వీటిలో ఒకటి ఆదిల్షాహీ రాజ్యంగా (1490–1686) పాలించ బడింది. స్వతంత్ర బీజాపూర్ సామ్రాజ్య స్థాపన చేసిన యూసఫ్ ఆదిల్ షా కాలంలో బీజపూర్ ఉన్నత స్థితికి చేరింది. 1686 నాటికి మొగల్ చక్రవర్తులు బీజపూర్‌ను ఆక్రమించుకున్న తరువాత ఆదిల్షా పాలన ముగింపుకు చేరింది. 1724లో హైదరాబాదు నిజాం స్వాతంత్ర్యం ప్రకటించుకుని దక్కన్‌లో నిజాం సామ్రాజ్య స్థాపన చేసాడు. తరువాత నిజాం బీజపూర్‌ను తనరాజ్యంలో విలీనం చేసుకున్నాడు. 1760లో మరాఠీల ద్వారా నిజాంను ఓటమితో తరువాత బీజపూరును నిజాం మరాఠీల వశంచేసాడు. 1818 నాటికి పేష్వా మూడవ బ్రిటిష్ – మరాఠీ యుద్ధంలో బ్రిటిష్ చేతిలో ఓడించ బడ్డాడు. తరువాత బీజపూర్ బ్రిటిష్ సామ్రాజ్యంలో భాగం అయింది.

# సంస్కరణలకు ఆద్యుడు

కవిత్వంలో ప్రగతి శీలమైన, సంస్కరణాత్మకమైన ఆదర్శాన్ని వ్యక్తీకరించిన కవి సుబ్రహ్మణ్య భారతి. ఆధునిక తమిళ సాహిత్యానికి ఆయనను మార్గదర్శకునిగా భావిస్తారు. ప్రాచీన, సమకాలీన అంశాల మేలు కలయికగా నిలిచే కవిత్వ శైలి ఆయన సొంతం. ఆధునిక తమిళ సాహిత్యంలో ఆయన ఆలోచన, ఊహ, పద్యంలోని పటుత్వం కొత్తపుంతలు తొక్కాయి. వేలాది కవితలు... భారత జాతీయ గీతాలు, ప్రణయ గీతాలు, బాలల కవితలు, ప్రకృతి గీతాలు, తమిళ భాష గొప్పతనాన్ని ఉగ్గడించే కవితలు, భారత స్వాతంత్ర్య పోరాట ప్రముఖులైన తిలక్, గాంధీ, లజపతిరాయ్ వంటివారిని ప్రస్తుతించే కవితలు వంటి విస్తారమైన, విభిన్నమైన అంశాలను స్వీకరించి అద్భుతమైన రీతిలో రాశారు. శక్తి, కాళి, వినాయకుడు, సుబ్రహ్మణ్యుడు, శివుడు, కృష్ణుడు వంటి వారినే కాక ఇతర మతదేవతలైన అల్లా, ఏసు వంటివారిని కూడా ప్రస్తుతించారు. జాతీయ, సంస్కరణ నాయకులైన అరబిందో, బాలగంగాధర తిలక్, స్వామి వివేకానంద వంటివారి ప్రసంగాలను అనువదించారు. చిన్నస్వామి సుబ్రహ్మణ్య భారతి’ (1882 డిసెంబరు 11 – 1921 సెప్టెంబరు 12) తమిళ రచయిత, కవి, పత్రికా సంపాదకుడు, స్వాతంత్ర్య సమర యోధుడు, సంఘ సంస్కర్త. ఆధునిక తమిళ కవిత్వానికి మార్గదర్శిగానూ, “మహాకవి భారతి”గానూ సుప్రసిద్ధుడు, తమిళ సాహిత్య ప్రముఖుల్లో అత్యున్నత వ్యక్తిగా పేరొందారు. ఆయన అసంఖ్యాక రచనలు భారత స్వాతంత్ర ఉద్యమ కాలంలో దేశభక్తి, జాతీయత వంటి భావాలను వెలుగొందేలా చేశాయి. భారతి చిన్నసామి సుబ్రహ్మణ్య అయ్యర్, లక్ష్మీ అమ్మాళ్ దంపతులకు సుబ్బయ్యగా 11 డిసెంబర్ 1882 లో డిసెంబర్ 11న ఎట్టయపురం గ్రామంలో జన్మించారు. తిరునల్వేలిలోని ఎం.డి.టి. హిందూ కళాశాల అన్న స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం చేశారు. యుక్త వయసు నుంచి సంగీతం అభ్యసించడం, 11వ యేటనే కవితలల్లడం నేర్చారు. విద్యలకు అధిదేవత అయిన సరస్వతీ దేవి పేరిట “భారతి” అన్న బిరుదాన్ని ఆ సమయంలోనే ఆయన పొందారు. విశేషమైన పట్టుదల,



కృషితో ఆయన 32 భాషలు (29 భారతీయ భాషలు, 3 విదేశీ భాషలు) నేర్చుకున్నారు. స్త్రీలు రాజకీయాల్లో భాగస్వాములు కావాలని ప్రబోధిస్తూ, ఉద్యమించిన వారిలో తొట్టతొలి సంస్కర్తగా భారతిని భావిస్తారు. భారతి స్త్రీల హక్కుల గురించి, వారి విద్య గురించి విస్తృత స్థాయిలో ఆలోచించారు. స్త్రీ పురుషులు ఇద్దరూ సమానులేనని భావిస్తే ప్రపంచం వైజ్ఞానికంగా, మేధాపరంగా సమున్నతంగా విలసిల్లుతుందని భారతి భావించారు. స్త్రీల హక్కులకు భంగం కలిగించేలా మాట్లాడిన శాస్త్రాలను, ఆచారాలను ఆయన ఖండించారు. ఆయన భావాల్లో చాలావరకూ ఆధునిక కాలానికి కూడా సమకాలీనంగా నిలవడం విశేషం.హిందూ సమాజంలోని కుల వ్యవస్థకు కూడా భారతి వ్యతిరేకంగా పోరాడారు. సంప్రదాయ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించినా తన కుల గుర్తింపును విడిచి పెట్టేశారు. జీవించే ప్రతి జీవం సమానమేనని భావించారు. దీన్ని చూపించేందుకు ఒక యువ దళితునికి ఉపనయనం చేసి బ్రాహ్మణుని చేశారు. అప్పట్లో తర్వాతి తరాల వారి మనస్సులోకి పెద్దలు విభజన బీజాలు నాటడాన్ని వెక్కిరించారు. వేదాలను, గీతను బోధించేప్పుడు తమ స్వంత ఆలోచనలు దానిలో చేర్చి కువ్యాఖ్యానాలు చేయడాన్ని బహిరంగంగా ఖండించారు. దళితులను హిందూ ప్రధాన స్రవంతిలోకి తీసుకు రావడానికి ఆయన గట్టిగా మద్దతిచ్చారు.తమిళనాట సుబ్రహ్మణ్య భారతి భావాత్మక విప్లవాన్ని సాధించారు. సంస్కరణ, దేశభక్తి, జాతీయ వాదం, తమిళ భాష ఔన్నత్యం వంటి అంశాల్లో ఆయన కవితలు తమిళులను తీవ్రంగా ప్రభావితం చేశాయి. సామాన్యమైన ప్రజలు ఆయన కవితలను కంఠస్థం చేసి సందర్భానుసారం ప్రస్తావించే స్థాయికి వచ్చాయి. కోట్లాదిమంది ప్రజలు ఆయన రాసిన కవితల పంక్తులను ప్రస్తావించడం విశేషం. ప్రేమ, భక్తి, కరుణ, శాంతి, యుద్ధం వంటి సార్వజనీనమైన అంశాల్లోనూ భారతి గీతాలు సందర్భానుసారంగా ప్రజల నాలుకలపై నర్తించాయి. భారత ప్రభుత్వం, మానవ వనరుల అభివృద్ధి శాఖతో కలిసి 1987లో అత్యున్నత జాతీయ స్థాయి సుబ్రహ్మణ్య భారతి పురస్కారాన్ని నెలకొల్పి ప్రతి సంవత్సరం హిందూ సాహిత్యంపై అత్యున్నత స్థాయి రచనలు చేసిన రచయితలను సత్కరిస్తోంది. భారతీయార్ విశ్వవిద్యాలయాన్ని ఆయన పేరిట 1982లో కోయంబత్తూరులో నెలకొల్పారు. మెరీనా బీచ్ వద్ద, భారత పార్లమెంటు భవనం వద్ద భారతీయార్ విగ్రహాన్ని నెలకొల్పారు. కోయంబత్తూరు లోని భారతీయార్ రోడ్డు, న్యూఢిల్లీ లోని సుబ్రమణియం భారతి మార్గ్,ఇలా ఎన్నో రోడ్లుకు ఆయన పేరు పెట్టారు. కర్ణాటక సంగీత రంగంలో తరచుగా వినవచ్చే కృతుల్లో సుబ్రహ్మణ్య భారతి కీర్తనలు ఉన్నాయి. ఆయన రచించిన పలు కీర్తనలను పలువురు కర్ణాటక సంగీత విద్వాంసులు కచేరీల్లోనూ, రికార్డుల్లోనూ గానం చేశారు. 1921 సెప్టెంబరు 12లో అర్ధరాత్రి ఆయన మరణించారు.

# ప్రోత్సాహమే మనోధైర్యానికి మూలాధారం

సెప్టెంబర్ 12న జాతీయ ప్రోత్సాహక దినోత్సవం జరుపుకోవడం వెనుక ఒక లోతైన మానవీయ భావజాలం దాగి ఉంది. మనిషి జీవనంలో విజయాలు, పరాజయాలు, ఆనందం, దుఃఖం, ఆశలు, నిరాశలు పరంపరగా ఎదురవుతుంటాయి. కానీ ఈ విభిన్న అనుభవాల మధ్య నిలబెట్టేది మనోధైర్యం. ఆ మనోధైర్యాన్ని నిలబెట్టే శక్తి ప్రోత్సాహమే. ఒక మనిషి మాట మరొక మనిషికి ప్రాణాధార మవుతుందని చెప్పడానికి ఇది అత్యుత్తమ ఉదాహరణ. జాతీయ ప్రోత్సాహక దినోత్సవం మొదట అమెరికాలో 2007లో ఆవిర్భవించింది. “ప్రతి మనిషి సామర్థ్యం అపారమైందే కాని దాన్ని వెలికితీయడానికి ప్రేరణ కావాలి” అన్న ఆలోచనతో ఈ రోజు ఏర్పాటైంది. ఆలోచన ఒక దేశానికి పరిమితం కాకుండా ప్రపంచ వ్యాప్తంగా వ్యాపించింది. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 12న ఈ దినాన్ని గుర్తుచేసుకుంటూ సానుకూల ఆలోచనలు పంచుకుంటున్నారు. ప్రోత్సాహం ఎందుకు అవసరమంటే, అది కేవలం ఒక శబ్దం కాదు, ఒక శక్తి. ఒక చిన్నపిల్ల తొలిసారి నడక మొదలు పెట్టినప్పుడు తల్లి చెప్పే “నీకు వస్తుంది” అన్న మాటే బలాన్నిస్తుంది. విద్యార్థి పరీక్షల భారం ఎదుర్కొన్నప్పుడు గురువు చెప్పే “నువ్వు చేయగలవు” అన్న మాటే ధైర్యాన్నిస్తుంది. క్రీడాకారుడు ఓటమి తర్వాత నిరుత్సాహానికి లోనైనప్పుడు స్నేహితుడు చెప్పే “తర్వాతి సారి నీ విజయం ఖాయం” అన్న మాటే అతనిని తిరిగి లేస్తుంది. ఈ మాటల్లో దాగి ఉన్న ప్రేరణ తోనే మనిషి అసాధ్యాన్ని సాధ్యం చేస్తాడు. సమాజంలో ప్రోత్సాహం ఒక బంధాన్ని పెంచుతుంది. మనం ఇతరులను అభినందించినప్పుడు, ప్రోత్సహించినప్పుడు వారితో ఉన్న బంధం మరింత దృఢమవుతుంది. ఉద్యోగ స్థలంలో సహోద్యోగికి ఒక ప్రశంస, కుటుంబంలో బిడ్డకు ఒక అభినందన, స్నేహితునికి ఒక ధైర్య వాక్యం – ఇవన్నీ కలిసి ఒక సానుకూల వాతావరణాన్ని సృష్టిస్తాయి. పరిశోధనల ప్రకారం ఉద్యోగ ప్రదేశాల్లో ప్రోత్సాహక వాతావరణం ఉంటే ఉత్పాదకత 30 శాతం పెరుగుతుందని, విద్యార్థులు 40 శాతం ఎక్కువగా ఆత్మ విశ్వాసంతో ముందుకు వెళ్తారని నిర్ధారించబడింది. ఇది గణాంకాల రూపంలో ప్రోత్సాహం యొక్క శక్తిని స్పష్టంగా చూపిస్తుంది. ఈ రోజు పాటించాల్సిన విధానం చాలా సులభం. కుటుంబ సభ్యులను ప్రోత్సహించాలి, సహోద్యోగులకు ధైర్యం చెప్పాలి, వెనుకబడిన వారికి సానుకూల మద్దతు అందించాలి. ఒక చిన్న సహాయం కూడా ఒక పెద్ద ప్రోత్సాహ మవుతుంది. ఉదాహరణకు, చదువులో ఇబ్బంది పడుతున్న విద్యార్థికి సహాయం చేయడం, బిజీగా ఉన్న స్నేహితుని పనిలో తోడ్పడడం, ఒక వృద్ధునికి ధైర్యం చెప్పడం వంటి చిన్న చర్యలు గొప్ప ఫలితాలు ఇస్తాయి. మన భారతీయ సంస్కృతిలో ప్రోత్సాహం ప్రత్యేక స్థానం కలిగి ఉంది. వేదాల్లో “మంచి మాట వంద యజ్ఞాల కంటే శ్రేష్ఠం” అని చెప్పబడింది. కవి గురజాడ అప్పారావు “దేశమంటే మట్టి కాదు, మనుషుల సమూహం” అన్నప్పుడు కూడా పరస్పర ప్రోత్సాహమే ఒక సమాజాన్ని నిర్మిస్తుందని సూచించారు. తాళ్ళపాక అన్నమయ్య, త్యాగరాజు కీర్తనల్లోనూ భక్తిని ప్రేరేపించే ఉత్సాహ వాక్యాలే ప్రధానంగా కనిపిస్తాయి. ప్రోత్సాహం ఇవ్వడం మన కర్తవ్యం మాత్రమే కాదు, మన సంస్కృతి కూడా. ఈ రోజు మనకు గుర్తుచేస్తున్నది – ప్రోత్సాహం ఒక వ్యక్తి మాత్రమే కాదు, ఒక సమాజాన్నీ మార్చగలదు. ఒక చిన్న వాక్యం, ఒక ఆశాజనకమైన దృష్టి, ఒక మధురమైన అభినందన –ఇవన్నీ కలిసి నిస్సహాయుడిని స్ఫూర్తివంతుడిగా మార్చగలవు. జాతీయ ప్రోత్సాహక దినోత్సవాన్ని కేవలం ఒక రోజుకు పరిమితం చేయకుండా ప్రతీ రోజూ మనం ఆచరించాలి. మన కుటుంబం, మన స్నేహితులు, మన సహచరులు మాత్రమే కాదు, మన పరిచయం లేని వ్యక్తికైనా ఒక చిరునవ్వు, ఒక సానుకూల మాట ఇవ్వగలిగితే అదే నిజమైన ప్రోత్సాహం అవుతుంది. ప్రోత్సాహం ఇస్తే ప్రేరణ కలుగుతుంది, ప్రేరణతో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది, ఆత్మవిశ్వాసం విజయానికి దారితీస్తుంది. ఈ శాశ్వత సత్యాన్నే సెప్టెంబర్ 12 జాతీయ ప్రోత్సాహక దినోత్సవం మనకు గుర్తుచేస్తుంది.

# తెలంగాణ ఉద్యమకారుల కల నెరవేరదా?

తెలంగాణ ఉద్యమాన్ని తన జీవితం నిండా మోసిన యోధుడు విలియం. 2025, సెప్టెంబర్ 7న ఆయన మృతి చెందడంతో, తెలంగాణ ఉద్యమ గాథలో ఓ బడుగు శబ్దం మౌనంగా మిగిలిపోయింది. ఈ రాష్ట్రం కోసం పోరాడిన వారు ఎందరో ఉన్నా, వెన్నెముకలాగా నిలిచిన వీరుల త్యాగానికి న్యాయం జరగకపోవడమే బాధాకరం. తెలంగాణ రాష్ట్రం కోసం ఎంతో మంది ఉద్యమకారులు తమ వ్యక్తిగత జీవితాన్ని విస్మరించి, నిరంతరం పోరాటాలకే అంకితమై, తెలంగాణ సాధించుకున్నా, ఈ రోజు దీన స్థితిలో కాలం గడుపుతున్నారు. నిస్సహాయంగా మిగిలిపోయి కాలం చెల్లిస్తున్నారు. అందులో విలియం ఒక ఉదాహరణ. విలియం కేవలం తెలంగాణ ఉద్యమ యోధుడే కాదు. 1962లో గోవా విమోచన పోరాటంలో పాల్గొని జైలులో ఉన్న చరిత్ర కలిగిన వ్యక్తి. రామ్ మనోహర్ లోహియా సోషలిస్టు సిద్ధాంతాలకు నిబద్ధుడుగా, శ్రమజీవుల హక్కుల కోసం పోరాడిన యోధుడు. 1969 తెలంగాణ తొలిదశ ఉద్యమంలో, అప్పటి నాయకులైన కేశవ్ రావు, మదన్ మోహన్, ప్రతాప్ కిషోర్, బద్రి విశాల్, ఆరీఫుద్దీన్, పీజే సూరి, చిరంజీవి లాంటి వారితో కలిసి పనిచేసిన నాయకుడు. గుణ పార్క్‌లో అమరవీరుల స్మారక స్తూపం కట్టినప్పుడు అమరవీరులకు చెందిన పుస్తకాలను, బట్టలను సేకరించి, వారి జ్ఞాపకార్థంగా అందులో పొందుపరిచాడని ఉద్యమకారులు చెప్పుకుంటున్నారు. మలిదశ ఉద్యమంలో, తను నివాసముండే అల్వాల్ నే ఉద్యమ కేంద్రంగా మార్చి, 1136 రోజుల రిలే దీక్షలు నిర్వహించిన నిరంతర స్ఫూర్తి. అందులో 200 రోజులకు పైగా స్వయంగా నిరాహార దీక్షలో పాల్గొనడం ఉద్యమం పట్ల ఆయనలో ఉన్న నిజమైన నిబద్ధతకు నిదర్శనం. ఆయనను మొదటిసారి కలిసిన సందర్భం, నాకు ఎప్పటికీ గుర్తుండిపోతుంది. నా దర్శకత్వంలో రూపొందిన ఫీచర్ ఫిల్మ్ “ఇంకెన్నాళ్లు– వాయిస్ ఆఫ్ తెలంగాణ” ప్రివ్యూ ప్రదర్శనకు ఆయన రావడం, ఆయనను ఆహ్వానించినవారు ప్రముఖ ఉద్యమ నాయకుడు ప్రొఫెసర్ కేశవరావు జాదవ్ గారు. ఆ సినిమాలో చూపించిన




మూడు తరాల, వివిధ పోరాటాలను (తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, 1969 ఉద్యమం, నక్సల్ ఉద్యమం, మలిదశ తెలంగాణ ఉద్యమం) ఒక కుటుంబ చిత్రంగా మలిచిన విధానం, భావోద్వేగాలను, ఉన్నదున్నట్లు సహజ సిద్ధంగా చిత్రీకరించిన తీరుని మెచ్చుకొని ప్రోత్సహించారు. ఆ సినిమాలో ఉన్న ఒక ప్రధాన పాత్ర “బుచ్చి రాములు” ఆ పేరుతోనే నన్ను సంబోధించారు. వారు అల్వాల్‌లో నిర్వహించిన నిరాహార దీక్షకు సంఘీభావంగా 588వ రోజున, నేను పాల్గొని సెప్టెంబర్ 30న జరగబోయే తెలంగాణ మార్చ్‌లో పాల్గొనాలని ఆ వేదికపై నుండి పిలుపునిచ్చాను. అవన్నీ మరవలేని మహత్తర గడియలు. ఆ సందర్భంలో జరిగిన పరిచయం, తరువాత మేం కలిసి అనేక ఉద్యమ సమావేశాల్లో పాల్గొనడం. వయసులో తేడా ఉన్నా, ఉద్యమం పట్ల ఉన్న మమకారం మమ్మల్ని ఒకే తరానికి చెందినవారిలా చేసిందన్నది నా అనుభూతి. తెలంగాణ వచ్చి పదకొండు సంవత్సరాలు గడిచినా, ఉద్యమ యోధులకు ఇచ్చిన హామీల్లో ఒక్కటి పూర్తి స్థాయిలో అమలు కాలేదు. 250 గజాల స్థలం లేదు. ఉద్యోగ హామీలు.. ఊహల్లోనే ఉంటున్నాయి. పింఛన్, వైద్యం, గౌరవ గుర్తింపు. మాటలకే పరిమితం. ఉద్యమంలో మృతి చెందిన కుటుంబాలకు కనీస ఆదరణ లేదు. ఈ విఫల హామీలే అప్పటి ఇప్పటి తెలంగాణ పాలకులపై ప్రజల అసంతృప్తికి ప్రధాన కారణం అవుతున్నాయి. విలియంని పోలిన ఉద్యమ వీరులు గుమ్మాల కొద్దీ మౌనంగా మరణిస్తున్నారు. వారు బ్రతికి ఉండగానే తెలంగాణ రాష్ట్ర సాధన ఫలాలను అనుభవించి పోతే సంతృప్తిగా ఉంటుంది. తెలంగాణ ప్రభుత్వానికి ఇప్పటికైనా మెలుకువ రావాలి. వీరిని గుర్తించడం అనేది ఉపకారం కాదు. అదొక చారిత్రక బాధ్యత. ఎన్నికల ముందు మీరే కదా వాగ్దానం చేసింది! వీలైనంత త్వరగా ఉద్యమకారులకు కింది మౌలిక హక్కులు, సహాయాలు ఇవ్వాలి. నివాస స్థలం, ఉద్యోగ ప్రాధాన్యత, ఉచిత వైద్య సహాయం, ఉద్యమ గుర్తింపు పత్రం, గౌరవ వేతనం. ఉద్యమం గురించి బహిరంగంగా ఆవిష్కరించేందుకు జ్ఞాపక స్మారకాలు, ఉద్యమ కేంద్రాల అభివృద్ధి చేయాలి. విలియం జీవితం... ఉద్యమం గురించి మా త్రమే కాదు, మన రాజ్యాంగం, మన సమాజం ఎంతగా శ్రమజీవుల కోసం పని చేయాలన్న సందేశాన్ని చెప్పేది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినా, ఉద్యమ స్ఫూర్తి నిలిచేది ఇలాంటి యోధుల వల్లే. వారిని మరచిపోతే, అది చరిత్రను ద్రోహం చేసి నట్లే. వారికి న్యాయం జరిగితే మాత్రమే, తెలంగాణ అనే కల నిజమౌతుంది.

# ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ లో అడ్మిషన్స్

**నల్గొండ సెప్టెంబర్ 11 ప్రభాత సూర్య** క్యాంపెయిన్ లో భాగంగా, ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ బి ధర్మానాయక్ జాయిన్ డైరెక్టర్ అడ్మిషన్స్ విచ్చేసి, దూరవిద్య యొక్క ప్రాముఖ్యత గురించి తెలిపారు. ఇందులో భాగంగా మాట్లాడుతూ, ఈ మధ్యకాలంలో గంటా చక్రపాణి వైస్ ఛాన్సలర్గా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకి నియామకం తర్వాత ఎన్నో వినూత్న కోర్సుల రూపకల్పన చేసి, విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా చదువుకుంటూ ఉద్యోగం చేసుకునే విధంగా, ఉద్యోగాలు చేసుకుంటూ చదువుకునే విధంగా తీర్చిదిద్దారని, గతంలో ఎన్నడూ లేని విధంగా స్టైఫండ్ ఆధారిత విద్యా కార్యక్రమం స్టెప్ ద్వారా అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులను అప్రెంటిస్షిప్ ల చదువుతోపాటు, గ్రామీణ మరియు గిరిజన విద్యార్థులకు స్వల్పకాలిక వృత్తి విద్యా కోర్సులను కూడా స్వామి రామానంద తీర్థ రూరల్ ఇన్స్టిట్యూట్ ద్వారా ప్రతి సంవత్సరం 5000 మంది గ్రామీణ గిరిజన విద్యార్థులకు ఈ కోర్సులను అందుబాటులోకి తీసుకురావటం జరిగిందని, అంతేకాకుండా, తెలంగాణలో గోండు కోయ, చెంచు ఆదివాసులు, దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్లు ఎలాంటి ఫీజు లేకుండా ఉన్నత చదువులు చదువుకునే అవకాశం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం అందుబాటులోకి తీసుకొని రావడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల దూరవిద్య కోఆర్డినేటర్ డాక్టర్ సుంకరి రాజారామ్ మాట్లాడుతూ, ద్వారా ఔవ-కార్యక్రమం ద్వారా మహిళలను ఆర్థికంగా అభివృద్ధిలోకి తెచ్చి చదువుకునే దశలోనే మహిళా పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలని యూనివర్సిటీ సరికొత్త కోర్సులను అందుబాటులోకి తేవడం జరిగింది. అంతేకాకుండా సమాజంలోని అన్ని వర్గాలకు సమత ఫ్రీషిప్ మరియు నిపుణ ఫెలోషిప్లు అందుబాటులోకి తేవడం జరిగిందని, అధ్యయన కేంద్రం విద్యార్థినులకు అందుబాటులో ఉందని, చదువు మధ్యలో ఆపేసిన వారు, ఆర్థిక ఇబ్బందులతో చదువు కొనసాగించలేకపోయిన వారు, వితంతువులు మొదలగు




వారికి ఈ కళాశాలలో విద్యనభ్యసించుటకు సువర్ణ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల కౌన్సిలర్లు నగేష్, పద్మ, విజయ,ఉస్మాన్ భాష, నరేందర్, రామ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

# మాధాపూర్‌లోనీ ఎంపిపి స్కూల్‌కు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్టేజి నిర్మాణం

**మాదాపూర్ ప్రభాత సూర్య :** మాధాపూర్‌లోని ఎంపిపి స్కూల్‌లో విద్యార్థుల కోసం స్టేజి నీ హైదరాబాద్ జూబ్లీహిల్స్ లయన్స్ క్లబ్ సహకారంతో నిర్మించారు. ఈ స్టేజీని గురువారం రోజు లయన్స్ జిల్లా గవర్నర్ 320 లయన్ అమర్‌నాథ్ రావు ప్రారంభించారు. ఈ నిర్మాణానికి లయన్ గిరిజా రెడ్డి, డా. పి. సీత, జయశ్రీ మూర్తి, జ్వాల వైష్ణవి, మండవ శిల్ప విరాళాలు అందించారు. ఈ కార్యక్రమాన్ని క్లబ్ అధ్యక్షురాలు లయన్ కోనేరు రామసుందరి,, కార్యదర్శి లయన్ రిందా దేవి, స్కూల్ హెడ్ మాస్టర్ మోహన్ రావు సమన్వయ పరిచారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో నరసింహరాజు, రామమోహనర్ సౌభాగ్య, మర్రి ప్రవీణ్, ఈ.వి. రమణ ఆర్.ఎస్. తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం నిర్మించిన ఈ షెడ్, విద్యాభివృద్ధి పట్ల లయన్స్ క్లబ్ చూపుతున్న అంకితభావానికి నిదర్శనమని నిర్వాహకులు తెలిపారు. విద్యార్థుల హితమే లయన్స్ అభిమతం గా ఎన్నో భోజనం మట్టి లో చేస్తున్న పిల్లలు పరిస్థితి గమనించి, పరిశీలించి ప్రార్థించే పెదవులు కన్నా సహాయం చేసే చేతులు మిన్న భావం తో దాతృత్వం తో ముందుకు వచ్చిన లయన్స్




క్లబ్ ఆఫ్ జూబ్లీ హిల్స్ వారికి స్కూల్ హెడ్ మాస్టర్ మోహన్ రావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో లయన్స్ క్లబ్ సభ్యులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ శాంతి అర్జున్, ప్రధానోపాధ్యాయులు బస్వలింగం,ఉపాధ్యాయులు సుధారాణి, లీలా దేవి, బాల మణి, రాజగోపాల్ రెడ్డి, ప్రసాద్, మాధవి, ప్రేమ్ కుమార్, సారిక, నవ్య టీచర్, తదితరులు పాల్గొన్నారు.

# దోపిడీ అసమానతలపై తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో పోరాడుదాం..

లియంసిపిఐ (యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి పిలుపు..

**శేరిలింగంపల్లి ప్రభాత సూర్య :** వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవ సభ మియాపూర్ డివిజన్ ముజఫర్ అహ్మద్ నగర్ తాండ్ర రామచంద్రయ్య స్మారక భవన్ లో కామ్రేడ్ వడ్యా తుకారాం నాయక్ అధ్యక్షతన జరిగింది. ఈ సభకు యంసిపిఐ(యు) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి హాజరై మాట్లాడుతూ నాటి నైజాం పాలనలో దేశ్ ముఖులు, జాగీరు దారులు, భూస్వాములు, పటేల్ పట్వారీ లు అంతా కలిసి వెట్టిచాకిరి కి ప్రజలను గురి చేస్తూ, లేవి గల్లా ల పేరుతో ప్రజలను పీడించి, దోపిడీ అసమానతలు పెంచిన నాటి వ్యవస్థకు వ్యతిరేకంగా ఆంధ్రమహాసభ, కమ్యూనిస్టు ల ఆధ్వర్యంలో బాంచెను కాల్మొక్తా, అనే విధానం నుండి గుడిసెలు,గుత్పలు, చివరికి ఆత్మరక్షణ కోసం నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నేటి అన్ని ప్రజా పోరాటాలకు ఆదర్శం గా ఉంది అని ఈ పోరాటం లో మూడు వేల గ్రామాలు విముక్తి కాగా, 4500 మంది అమరత్వం పొందారు, 10 లక్షల ఎకరాల భూమి పంపిణీ జరిగింది అని ఇది చరిత్ర అని ఈ పోరాటంలో షేక్ బందగి, షోయబుల్లాఖాన్ లాంటి మైనారిటీలు బలి అయ్యారు అని దీన్ని హిందూ ముస్లిం కొట్లాట గా నేడు కొంతమంది మతోన్మాదులు చిత్రీకరణ చేస్తున్నారు అని దీనికి వ్యతిరేకంగా నేడు కమ్యూనిస్టులు ఏకం అయ్యి నేటి తరానికి ఆదర్శంగా నిలుద్దాం అని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం లో గ్రేటర్ హైదరాబాద్ సహాయ కార్యదర్శి తుడుం అనిల్ కుమార్, గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి వర్గ సభ్యులు కుంభం సుకన్య, అంగడి పుష్ప, ఇస్లావత్ దశరథ్ నాయక్, కర్ర దానయ్య,




సభ్యులు బి విమల, మియాపూర్ డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు జి శివాని, యం డి సుల్తానా బేగం,పార్టీ సభ్యులు యం డి రజియా బేగం, ఈశ్వరమ్మ, గీత తదితరులు పాల్గొన్నారు

# గ్రూప్ -1పరీక్షల్లో అవకతవకలకు పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

జీవో నెం 29 రద్దు చేయాలి జీవో నెం 55 ఇంప్లిమెంటేషన్ చేయాలి

బీఆర్ఎస్వి రాష్ట్ర జనరల్ సెక్రటరీ వి అశ్వంత్ కుమార్

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 11 (ప్రభాత సూర్య) :**గ్రూప్ వన్ పరీక్ష నిర్వహణంలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ విఫలమైనందున నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని బీఆర్ఎస్వి శాంతియుత నిరసనలో భాగంగా జేఎన్టీయూ యూనివర్సిటీ మెయిన్ గేటు దగర నిరుద్యోగ విద్యార్థులతో కలిసి నిరసన తెలియజేస్తుంటే అరెస్ట్ చేసి జేఎన్టీయూ పోలీస్ స్టేషన్ కి తరలించడం దారణమని బీఆర్ఎస్వి రాష్ట్ర జనరల్ సెక్రటరీ వి అశ్వంత్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వి రాష్ట్ర జనరల్ సెక్రటరీ వి అశ్వంత్ కుమార్ మాట్లాడతూ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే అడిగే వారిని అరెస్టులు చేయడం కాదు గ్రూప్ -1పరీక్షల్లో అవకతవకలకు పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. జీవో నెం 29 రద్దు చేసి, జీవో నెం 55 ఇంప్లిమెంటేషన్ చేయాలని, గ్రూప్ - అన్నారు. హైకోర్టు చెప్పినట్టుగా అవకతవకలపై సిట్టింగ్ జడ్జితో జ్యూడిషియల్ కమిషన్ ఏర్పాటు చేసి పూర్తి స్థాయి విచారణ చేయాలని, గ్రూప్ -1 పరీక్షల్లో అవకతవకలకు బాధ్యత వహించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి టీజీపీఎస్సీ చైర్మన్, కమిషన్ అధికారులు వెంటనే రాజీనామా చేయాలని అన్నారు. లేనియడల ప్రభుత్వంపై యుద్ధం చేయక తప్పదని, గ్రూప్ -1 బీఆర్ఎస్వి అభ్యర్థులకు న్యాయం జరిగేంత వరకు




పోరాటం చేయక తప్పదు అని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వి నాయకులు, అఖిల్, కళ్యాణ్, రాజు, గోలకొండ రాజు, విక్రమ్, శివ, శ్రావణ దుర్గ, అక్షయ, రమణ తదితర విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

## త్రిబుల్ ఆర్ రోడ్ లో కోల్పోతున్నవ్యవసాయ రైతులకు నష్టపరిహారం తో

ఇంటికో ఉద్యోగం

మర్రిగూడ మండల

తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు దోమల వెంకటయ్య యాదవ్ డిమాండ్.



**మర్రిగూడ సెప్టెంబర్ 11(ప్రభాత సూర్య)** మర్రిగూడ మండల పరిధిలోని భూమిని కోల్పోయిన వ్యవసాయ రైతులకు కోటి రూపాయలు చొప్పున చెల్లించి ఇంటికో ఉద్యోగం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు దోమల వెంకటయ్య యాదవ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, త్రిబుల్ ఆర్ రోడ్ వేస్తే భూమికి భూమి ఇవ్వాలని ఓపెన్ వాల్యుయేషన్ భూమి మీద నాలుగు రెట్లు పెంచి ఇవ్వాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రైతులకు తెలవకుండా అన్లైన్ మెంట్ రూపొందించిన అన్లైన్ మెంట్ రద్దు చేయాలని దామర భీమనపల్లి, సరంపేట వట్టిపల్లి ,బట్లపల్లి , రైతులకు ఆమోదం లేకుండా అన్లైన్ మెంట్ రూపొందించడం సరియైనది కాదని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన పుప్పాల యాదయ్య, మర్రిగూడ మండల తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు పోలే మల్లయ్య, తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు చిన్న, గునుగంటి శ్రీరాములు, కాసర్ల అంజయ్య, దేవరకొండ సత్తయ్య, వీరమల్ల మల్లేష్, సత్యనారాయణ రెడ్డి, వరికుప్పల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలి

టి యు జేఏసీ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గుండమల్ల శ్రీనివాస్.



**సంస్థాన్ నారాయణపూర, సెప్టెంబర్ 11( ప్రభాత సూర్య)** :హైదరాబాదులోని ఇందిరాపార్క్ వద్ద జరిగే తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ మహా ధర్నా కు భారీగా తరలిరావాలని తెలంగాణ ఉద్యమ జర్నలిస్టుల వేదిక రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గుండమల్ల శ్రీనివాస్ పిలుపునిచ్చారు.ఆయన మాట్లాడుతూ ఆంధ్ర పీడితను తొలగించుకొని తెలంగాణను తెచ్చుకున్న ఉద్యమకారులకు గత బిఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని తెలిపారు. ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇంటి స్థలాలు, పెన్షన్లు, గుర్తింపు కార్డులు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్నా, మంత్రులు,ఎమ్మెల్యేలు గాని ఉద్యమకారులను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ స్వరాష్ట్రం కొరకు,స్వపరిపాలన కోసం ఆత్మాభిమానం తో చేసిన ఉద్యమకారుల పోరాటాలను గుర్తుపెట్టుకోలేదని తెలిపారు. తెలంగాణ ఉద్యమ వార్తలు రాసిన జర్నలిస్టులను ఉద్యమకారులు గుర్తించాలని డిమాండ్ చేశారు. అందుకే కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ నేడు హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద జరిగే (టియుజేఏసీ) మహా ధర్నాను ఏర్పాటు చేస్తున్నామని ఈ ధర్నాకు తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ఉద్యమకారులు, విద్యార్థి సంఘాలు తెలంగాణ కొరకు పోరాడిన ప్రతి ఒక్కరు పాల్గొని టియుజేఏసీ కి నైతిక మద్దతునిస్తూ.. మహాధర్నా కార్య క్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు.మహాధర్నా తర్వాత తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం పట్టించుకోకపోతే ఈ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని అన్నారు.

## ఘనంగా భజరంగ్ సేనా వినాయక నిమజ్జనం..

**శేరిలింగంపల్లి ప్రభాత సూర్య :**ఎంఐజి ఫేస్ 1 బజరంగ్ సేన ఆధ్వర్యంలో వినాయక నిమర్జనం ఉత్సవాలు ఘనంగా జరిగాయి,ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుండి కళాకారులను పిలిపించి ఎంతో ఘనంగా వినాయక నిమర్జనం ఉత్సవాలను బజరంగ్ సేన, టీవీ రావు , టీవీ శ్రీనివాస్ , రవివర్మ వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కంజర్ల కృష్ణమూర్తి, కంజర్ల కృష్ణమూర్తి చారి ఫౌండేషన్ తరపున 11,111 రూపాయలు అన్న ప్రసాదం కొరకు చెందా అందజేశారు.ఈ కార్యక్రమంలో సునంద,రాజేందర్ చారి, సుజాత, అనిత,సాయి వెంకట హర్ష తదితరులు పాల్గొన్నారు, ఎంఐజి కాలనీ, పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది.



## ది చెన్నై సిల్క్స్ 9వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేకమైన ఆఫర్లు

దసరా, దీపావళి సందర్భంగా ఫెస్టివల్ కలెక్షన్స్ అందుబాటులో ఉన్నాయి

ది చెన్నై సిల్క్స్ స్టోర్ మేనేజర్ నాగేందర్



**కూకట్ పల్లి, సెప్టెంబర్ 11 (ప్రభాత సూర్య) :** ది చెన్నై సిల్క్స్, శ్రీ కుమారన్ గోల్డ్ అండ్ డైమాండ్స్ తొమ్మిదవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేకమైన ఆఫర్స్ ను అందజేస్తున్నట్లు స్టోర్ మేనేజర్ నాగేందర్ వెల్లడించారు. ఈ సందర్భంగా కూకట్ పల్లి వై జంక్షన్ లోని ది చెన్నై సిల్క్స్ షో రూమ్ లో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈనెల 15వ తేదీన స్టోర్ కు సంబంధించి తొమ్మిదవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని తమ దగ్గర ఉన్న కలెక్షన్స్ లో సారీస్, లేడీస్ వేర్, చిల్డ్రన్స్, మెన్స్ వేర్ తోపాటు వివిధ రకాల వాటిలో బై వన్ గెట్ వన్, కాంబో ఆఫర్స్, డిస్కౌంట్ లను వినియోగదారులకు అందజేస్తున్నట్లు వారు వెల్లడించారు. రాబోయే దసరా దీపావళిని సైతం పురస్కరించుకొని ఫెస్టివల్ కలెక్షన్లు కూడా అందుబాటులోకి తెచ్చామని వినియోగదారులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ ఆఫర్లు కూకట్ పల్లి వై జంక్షన్ లోని ది చెన్నై సిల్క్స్ షోరూం తో పాటు మెహదీపట్నంలో ఉన్నటువంటి స్టోర్ లో కూడా అందుబాటులో ఉన్నాయని అన్నారు. వినియోగదారులందరూ స్టోర్ ను సందర్శించి అద్భుతమైన కలెక్షన్లను కొనుగోలు చేయాల్సిందిగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో షాపింగ్ మాల్ మేనేజర్ నాగేందర్, ఏజీఎం రవికాంత్, పిఆర్ఓ యోగానంద్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# హత్యకు గురైన రేణు అగర్వాల్ కుటుంబ సభ్యులను పరామర్శించిన టిపిసిసి ఉపాధ్యక్షులు బండి రమేష్


**కూకట్ పల్లి, సెప్టెంబర్ 11 (ప్రభాత సూర్య) :** కూకట్ పల్లి స్వాన్ లేక్ అపార్ట్మెంట్ లో బుధవారం హత్యకు గురైన రేణు అగర్వాల్ కుటుంబ సభ్యులను టిపిసిసి ఉపాధ్యక్షులు, జహీరాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ ,కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్చార్జి బండి రమేష్ గురువారం వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. మృతురాలి భర్త రాకేష్ అగర్వాల్ ను పోలీసులను సంఘటనకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేసి, ఈ ఘటనను ఖండించారు. నిందితులను త్వరగా పట్టుకోవాలని పోలీసులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఎక్స్ వైస్ చైర్మన్ లక్ష్మయ్య, ఏ బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి, బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, శివ చౌదరి, సుదర్శన్, భరత్ తదితరులు పాల్గొన్నారు.





# విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేత

**చౌటుప్పల్.సెప్టెంబర్ 11. ప్రభాత సూర్య :** ది సిటిజన్ కోపరేటివ్ సొసైటీ లిమిటెడ్ షేర్ హెూల్డర్స్ పిల్లలకు గత కొన్ని సంవత్సరాలుగా ప్రతిభా పురస్కారాలు అందజేస్తూ చదువులో విద్యార్థులను ప్రోత్సహిస్తున్నట్లుగా సిటిజన్ కోపరేటివ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం నరేందర్ కుమార్ తెలిపారు. గురువారం చౌటుప్పల్ బ్రాంచ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో పదవ తరగతి, ఇంటర్ ద్వితీయ సంవత్సరాలలో 95% మార్కులు సాధించిన షేర్ హెూల్డర్స్ పిల్లలకు సొసైటీ ఎండి ఎం నరేందర్ కుమార్ చేతుల మీదుగా ప్రతిభా పురస్కారాలను అందజేశారు.ఈ సందర్భంగా ఎండి మాట్లాడుతూ... సిటిజన్ సొసైటీ ఆరు రాష్ట్రాల్లో 42 శాఖల ద్వారా 4300 కోట్లకు పైగా వ్యాపారం చేస్తున్నారని తెలిపారు.గత ఆర్థిక సంవత్సరంలో సభ్యులకు 18 శాతం డిపాజిట్లు చెల్లించినట్లుగా చెప్పారు. గత 28 సంవత్సరాలుగా 10, ఇంటర్మీడియట్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన బ్యాంకు షేర్ హెూల్డర్స్ పిల్లలకు ఈ ప్రతిభ పురస్కారాలను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ జే.పూర్ణయ్య, బ్యాంకు సిబ్బంది కౌశిక్, మహేష్,కళ్యాణి,కృష్ణ, పద్మ పాల్గొన్నారు.




# పల్లెల్లో అంతర్గత రోడ్ల అభివృద్ధికి కృషి చేస్తా





**అంతర్గత రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు**

**గొర్లవీడు గ్రామంలో సీసీ కెమెరాలను ప్రారంభించిన ఎమ్మెల్యే..**

**జయశంకర్ భూపాలపల్లి.** గ్రామీణ ప్రాంత ప్రజలకు రాకపోకలు సులభతరం చేయడం, వ్యవసాయ ఉత్పత్తులకు రవాణా సౌకర్యం కల్పించడం, విద్యార్థులు, కార్మికులు, రోగులు సులభంగా ప్రయాణించేలా చేయడం లక్ష్యంగా భూపాలపల్లి నియోజకవర్గంలోని అన్ని పల్లెల్లో అంతర్గత రోడ్ల అభివృద్ధికి కృషి చేస్తానని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. గురువారం భూపాలపల్లి నియోజకవర్గంలోని భూపాలపల్లి మండలంతో పాటు గణపురం మండలంలోని వివిధ గ్రామాల్లో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పర్యటించారు. వివిధ అభివృద్ధి పనులకు జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మీ తో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మొత్తం రూ.390 లక్షల వ్యయంతో వివిధ గ్రామాల్లో రోడ్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. భూపాలపల్లి మండలం కమలాపూర్ గ్రామంలో కమలాపూర్ నుండి పెద్దాపూర్ వరకు రూ.20 లక్షలు, ఎస్ యం కొత్తపల్లి నుండి దొమ్మటిపల్లి చెరువు వరకు రూ.100 లక్షలు, గొర్లవీడు గ్రామంలో జడ్పీ రోడ్డు నుండి మల్లయ్యపల్లి వరకు రూ.20 లక్షలు, ట్రాన్స్ఫార్మర్ నుండి మొరంచవాగు వరకు రూ.20 లక్షలు.గణపురం మండలం రంగారావుపల్లి నుండి దశరథం తండా వరకు రూ. 20 లక్షలు, వీర్లపల్లి(బంగ్లాపల్లి) నుండి చక్రవర్తిపల్లి వరకు రూ.20 లక్షలు, బంగ్లాపల్లి ఎస్సీ కాలనీ నుండి మామిడి తోట వరకు రూ.20 లక్షలు, సీతారాంపూర్ నుండి కొండాపూర్ వరకు రూ.20 లక్షలు, అప్పయ్యపల్లి తూపురం నుండి కొండంపల్లి వరకు రూ.20 లక్షలు, గణపురం చీరలపల్లి చింతల నుండి లబ్బదండ వాగు వరకు రూ.130 లక్షలతో వ్యవసాయ పొలాలకు వెళ్లే అంతర్గత రోడ్ల నిర్మాణపనులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు.ఈ సందర్భంగా ఆయా గ్రామాలల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ... గ్రామీణ రహదారులు బాగుంటేనే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని, అందుకోసం ప్రభుత్వ నిధులతో పాటు ఇతర పథకాల ద్వారా కూడా రహదారి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి రోడ్డు సౌకర్యం అందే వరకు కృషి చేస్తానని ఎమ్మెల్యే చెప్పారు. అభివృద్ధి అన్నది పట్టణాలకు మాత్రమే పరిమితం కాకుండా, పల్లెల్లో కూడా సమానంగా ఉండాలి అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. గొర్లవీడు గ్రామంలో సీసీ కెమెరాలను ప్రారంభించిన ఎమ్మెల్యే జీఎస్సార్..నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకపాత్ర పోషిస్తాయని ఎమ్మెల్యే జీఎస్సార్ అన్నారు. భూపాలపల్లి మండలం గొర్లవీడు గ్రామంలో గ్రామ దాతల సహకారంతో సుమారు రూ.2 లక్షల 50 వేల వ్యయంతో 20 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకున్నారు. కాగా, సీసీ కెమెరాల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఎక్కడైతే శాంతిభద్రతలు పటిష్టంగా ఉంటాయో, అక్కడే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ప్రజల రక్షణ, భద్రత గురించి పోలీసులు ఎల్లవేళలా పనిచేస్తున్నట్లు తెలిపారు. దొంగతనాలు, నేరాలు, రోడ్డు ప్రమాదాలు, నిందితులను తొందరగా పట్టుకునేందుకు సీసీ కెమెరాలు ఎంతో దోహదపడతాయన్నారు. గొర్లవీడు గ్రామస్తులు దాతల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం మంచి విషయమన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల ప్రజలు కూడా ముందుకువచ్చి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజల్లో అవగాహన కల్పించి ముఖ్య పాత్ర పోషించిన భూపాలపల్లి పోలీసులను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట పలువురు ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, పోలీసులు, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులు ఉన్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్య ఖర్చులకు ఆర్థిక సహాయం

**ఆరోగ్యం తిరిగి పొందడానికి ఇచ్చిన సాయం జీవితాంతం గుర్తుండిపోతుంది**

**క్లబ్ అధ్యక్షులు మేకల మారుతి యాదవ్**

**కమాన్ పూర్ :** లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీకాలనీ ఆధ్వర్యంలో బేగంపేట గ్రామానికి చెందిన ఉదరి కొమురయ్య ఇటీవల అనారోగ్య కారణాలతో అతని కాలు తీసివేయడం జరిగింది.తన పరిస్థితిని ఎల్ సి ఐ ఎఫ్ కోఆర్డినేటర్ మొల్మూరి శ్రీనివాస్ దృష్టికి తీసుకురాగా వెంటనే క్లబ్ సభ్యులతో చర్చించి పున్నం మధుకర్ రెడ్డి,గంట వెంకటరమణ రెడ్డి,మేకల మారుతి యాదవ్, దొంతుల సురేష్, టీవీ సురేష్ బాబు, అద్దూరి శేషి కుమార్, ముస్త్యాల శ్రీనివాస్, లక్ష్మీనారాయణ,దొడ్ల శ్రీనివాస్, అబ్బు కేశవ రెడ్డి, ఎల్లంకి రామరావు, కాటం సత్యం, గడ్డం శ్రావణ్ కుమార్, మురహరి రావు సహకారంతో 10,000 ఆర్థిక సహాయం మరియు గుండ శ్రీనివాస్,కుమార్ ల సహకారంతో 25కిలోల బియ్యం అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు మేకల మారుతి యాదవ్ మాట్లాడుతూ సమాజంలో ఎవరైనా కష్టాల్లో ఉన్నప్పుడు సహాయం చేయడామే లయన్స్ క్లబ్ ధ్యేయంగా పనిచేస్తుంది. పరిస్థితి వివరించిన వెంటనే స్పందించిన దాతలకు లైన్స్ క్లబ్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.అనంతరం మాజీ జడ్పీటీసీ క్లబ్ డైరెక్టర్ క్లబ్ డైరెక్టర్లు గంట వెంకటరమణ రెడ్డి మాట్లాడుతూ మేము చేసిన ఈ చిన్న సహాయం కొమురయ్య ఆరోగ్య పునరుద్ధరణకు దోహదపడాలని, ఇంకా ఎవరైనా దాతలు ఉంటే సంప్రదించాలని కోరుతూ భవిష్యత్తులో కూడా సభ్యుల సహకారంతో ఇలాంటి సేవా కార్యక్రమాలను మరిన్ని కొనసాగిస్తాము అని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.




## చేనేత జాతీయ అవార్డు గ్రహీతలను సన్మానించిన

**అడిషనల్ కలెక్టర్ భాస్కర్ రావు**



**సంస్థాన్ నారాయణపురం, సెప్టెంబర్ 11( ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా అడిషనల్ కలెక్టర్ భాస్కర్ రావు పుట్టపాక గ్రామానికి విచ్చేసి, చేనేత జాతీయ అవార్డు గ్రహీతలు గజం నర్మదా నరేందర్, గూడ పవన్ ఇంటికి వెళ్లి, వారితో సమావేశమై వారిని శాలువాతో సత్కరించినారు. తదనంతరం పుట్టపాక హ్యాండ్లూమ్ క్లస్టర్ వద్దకు విచ్చేసి, కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర అవార్డు గ్రహీతలు సామల భాస్కర్, కొలను శంకర్ లను శాలువాతో సత్కరించినారు. అదేవిధంగా పుట్టపాక హ్యాండ్లూమ్ క్లస్టర్ ప్రహరీ గోడ నిర్మాణానికి నిధుల మంజూరుకు హామీ ఇచ్చినారు. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ గజం గోవర్ధన్ , జిల్లా చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు శ్రీనివాస్ , ఆర్డీవో , డివో రాజేశ్వర్ రెడ్డి , ఎమ్మార్వో , ఎంపిడిఓ , సిడివో రమాకాంత్ గ్రామ కార్యదర్శి , పద్మశాలి సంఘం అధ్యక్షులు కార్యవర్గ సభ్యులు, జాతీయ అవార్డు గ్రహీతలు, గ్రామ చేనేత ప్రముఖులు, చేనేత కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

## తృటిలోజి తప్పిన పెను ప్రమాదం

**కారును తప్పించ బోయిన ఆర్టీసీ బస్సుకు తప్పిన పెను ప్రమాదం**




**సంస్థాన్ నారాయణపురం, సెప్టెంబర్ 11( ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం జనగాం గ్రామ శివారులో కారును తప్పించ బోయిన ఆర్టీసీ బస్సుకు తప్పిన పెను ప్రమాదం ఈ సంఘటనకు సంబంధించి డ్రైవర్, ప్రయాణికుల వివరాలు..నల్గొండ ఆర్టీసీ డిపోకు చెందిన టీజి 05 జెడ్ 0045 నెంబర్ గల బస్సు చండూరు మీదగా చౌటుప్పల్ కు వెళ్తుండగా ఘటన.... జనగాం గ్రామ శివారులో రోడ్డు పక్కన ఆగి ఉన్న కారు ఒకేసారి రోడ్డుపైకి రావడంతో డ్రైవర్ శ్రీనివాసరెడ్డి కారును తప్పించడంతో బస్సు పక్కకు దూసుకుపోయింది. బస్సు టైర్లు భూమిలోకి దిగబడి బస్సు ఇంజను భూమికి ఆనడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ బస్సులో 80 మంది ప్రయాణికులు ఉన్నట్లు కండక్టర్ తెలిపారు. ఎవరికి ఎట్లాంటి అపాయం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.....

## బిఎస్పి లోకి వద్దిగల్ల బాబు

**పార్టీ లోకి ఆహ్వానించిన రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రహీం శేఖర్**



**తుర్కయంజాల్, సెప్టెంబర్ 11, ప్రభాత సూర్య:** బహుజన్ సమాజ్ పార్టీ తుర్కయాంజాల్ మున్సిపాలిటీ మాజీ అధ్యక్షులు వద్దిగల్ల బాబు రంగారెడ్డి జిల్లా బిఎస్పి పార్టీ కార్యకర్తల సమావేశంలో రాష్ట అధ్యక్షులు ఇబ్రామ్ శేఖర్ చేతుల మీదుగా కాంగ్రెస్ పార్టీ నుండి బహుజన్ సమాజ్ పార్టీ లోకి వద్దిగల్ల బాబు ని కండువా కప్పి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో జిల్లా బిఎస్పి పార్టీ అధ్యక్షుడు పల్లపు రాములు,జిల్లా బిఎస్పి పార్టీ కార్యదర్శి గ్యార మల్లేష్, యంజాల ప్రహ్లాద్,తుర్కయంజాల్ మున్సిపాలిటీ అధ్యక్షులు పట్నం రమేష్ కురుమ, ప్రధాన కార్యదర్శి మల్లెల రఘు, కోహెడ సెక్టార్ అధ్యక్షులు శీలం అంగదు కుమార్,తదితరులు పాల్గొన్నారు.

## ఊర చెరువు కట్టపై వనమహెూత్సవం



**చౌటుప్పల్.సెప్టెంబర్11. ప్రభాత సూర్య :** చౌటుప్పల్ పురపాలక కేంద్రంలోని వడ్ల దాటి ఊర చెరువు కట్టపై గురువారం వనమహెూత్సవములో భాగంగా చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ జి వెంకటరామిరెడ్డి మొక్కలు ట్రినిటీ పాఠశాల విద్యార్థులు, మెప్మా విభాగం వారితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. ప్రతి పుట్టినరోజున ఒక మొక్క నాటి పుట్టినరోజు వేడుకలు జరుపుకోవాలని విద్యార్థులకు సందేశం ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మేనేజర్ అంజయ్య,ఆర్ఓ శ్రీధర్ రెడ్డి,సానిటరీ ఇన్స్పెక్టర్ హనుమాన్ ప్రసాద్,టిఎంసి కవిత, పర్యావరణ ఇంజనీర్ రేణు కుమార్, వార్డ్ ఆఫీసర్ కె రామ్ నారాయణ మూర్తి, బిల్ కలెక్టర్ బాలరాజు, భాస్కర్,మెప్మా ఆర్ పి లు,కాంట్రాక్టర్ శేఖర్ మొదలైన వారు పాల్గొన్నారు.

## మర్రిగూడ మండలంలో భారీ వర్షం



**మర్రిగూడ సెప్టెంబర్ 11 (ప్రభాత సూర్య)** మర్రిగూడ మండల వ్యాప్తంగా గురువారం భారీ వర్షం కురిసింది, గత వారం రోజులుగా ఎండ తీవ్రత తో, పత్తి, కంది, మొక్కజొన్న, పంటలు వాడు మొఖం పట్టినవి, ఈరోజు వర్షంతో మళ్లీ పంటలకు జీవం పోసినట్టు రైతులు సంతోషం వ్యక్తం చేశారు

# బిజినెస్

## అనిల్ అంబానీకి ఈడీ మరో షాక్



రిలయన్స్ గ్రూప్ సంస్థల అధినేత అనిల్ అంబానీకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మరో షాక్ ఇచ్చింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ)ను రూ.2,929.05 కోట్లకు మోసం చేసిన రుణ కేసులో రిలయన్స్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్ (ఆర్‌కామ్) డైరెక్టర్‌గా ఉన్న అనిల్ అంబానీపై ఈడీ కొత్త కేసు నమోదు చేసింది. అనిల్ అంబానీతో పాటు పలువురు ప్రభుత్వ అధికారులు, ఇతరుల పైనా కేసు నమోదయ్యిందని తెలుస్తోంది. గత నెలలో సీబీఐ దాఖలు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ ఈ చర్యలు తీసుకున్నట్టు సమాచారం. ఎస్‌బిఐ ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం పలు బ్యాంకులకు అనిల్ అంబానీ నేతృత్వంలోని ఆర్‌కామ్ రూ.40 వేల కోట్లకు పైగా రుణాలు బకాయిలుపడింది. 2018 నాటి గణాంకాల ప్రకారం ఒక్క ఎస్బీఐనే రూ.2929 కోట్ల మేర నష్టపోయింది. ఆర్‌కామ్ అనుకూలంగా రుణాలు పొందేందుకు ఎస్బీఐను తప్పుదోవ పట్టించారు. ఈ నేరపూరిత కుట్రలో కంపెనీ డైరెక్టర్లు సహా పలువురు అధికారులు పాలుపంచుకున్నారని ఈడీ నిర్ధారణకు వచ్చింది. బ్యాంక్‌ల నుంచి రుణాలు తీసుకుని మోసం చేసిన కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణ ప్రారంభించగా.. సీబీఐ కూడా సోదాలు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసు అంశంలో ఆగస్టులో అనిల్ అంబానీని ఈడీ 10 గంటల పాటు ప్రశ్నించింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్ఎ) కింద ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేసింది. నష్టాల్లో చిక్కుకున్న టెలికాం సంస్థ రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) తీసుకున్న రుణాన్ని కొన్ని నెలల క్రితం మోసపూరిత చర్య అని ఎస్బీఐ నిర్ణయించిన విషయం తెలిసిందే. రిజర్వ్ బ్యాంక్ మార్గదర్శకాల ప్రకారం.. ఏదైనా ఒక బ్యాంకు, ఒక ఖాతాను మోసపూరితమైందని గుర్తించిన తర్వాత ఆ విషయాన్ని 21 రోజుల్లోగా ఆర్బీఐకి సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. కేసును సీబీఐ, పోలీసులకు రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే ఎస్బీఐ ఫిర్యాదు మేరకు సీబీఐ, ఈడీ కేసు నమోదు చేసింది.

## ఐఫోన్ 17 సిరీస్‌పై శాంసంగ్ సెటైర్లు!





యాపిల్ సంస్థ ప్రపంచవ్యాప్తంగా ఐఫోన్ 17 సిరీస్ ఫోన్లను లాంచ్ చేసింది. యాపిల్ పార్క్‌లో నిర్వహించిన ఈవెంట్‌లో ఐఫోన్ 17, ఐఫోన్ ఎయిర్, ఐఫోన్ 17 ప్రో, ఐఫోన్ 17 ప్రో మ్యాక్స్ ఫోన్లను పరిచయం చేసింది. వీటితో పాటు కొత్త తరం ఎయిర్‌పాడ్స్ ప్రో3, స్మార్ట్ వాచ్ సిరీస్ 11, ఎస్‌ఈ3 వాచ్‌ను కూడా విడుదల చేసింది. ఈ నేపథ్యంలో ఎప్పటి మాదిరిగానే దక్షిణ కొరియాకు చెందిన శాంసంగ్ సంస్థ యాపిల్ ఉత్పత్తులపై వ్యంగ్యంగా పోస్టులు పెట్టింది. ఎక్కడా యాపిల్ పేరును ప్రస్తావించకుండా పరోక్షంగా సెటైర్లు వేసింది. యాపిల్ నుంచి ఇప్పటి వరకు ఫోల్డబుల్ ఫోన్ రాలేదంటూ 2022లో శాంసంగ్ ఓ పోస్ట్ పెట్టింది. తాజాగా ఆ పోస్ట్‌ను మరోసారి కోట్ చేస్తూ ఇప్పటికీ రాలేదంటూ యాపిల్‌పై సెటైర్ వేసింది. ఇక కెమెరా పని తీరును ఉద్దేశిస్తూ.. '48 ఎంపీ ఇ3 కూడా 200 ఎంపీకి సమానం కాదు' అంటూ మరో పోస్ట్ పెట్టింది. ఐఫోన్ 17 సిరీస్‌లో యాపిల్ కొత్తగా పరిచయం చేసిన స్లీప్ స్కోర్, లైవ్ ట్రాన్స్‌లేషన్ ఫీచర్లపై.. "స్లీప్ స్కోర్ కోసం కొందరు ఐదేళ్లు వేచి ఉండాల్సి వస్తుందని నమ్మలేకపోతున్నాం" అంటూ వ్యాఖ్యానించింది. యాపిల్‌ను ఎగతాళి చేస్తూ అఝుత్ హ్యాష్‌ట్యాగ్‌తో ఇలా వరుస పోస్ట్‌లు చేసింది. దీంతో కొందరు శాంసంగ్ లవర్స్ ఆ పోస్టులకు మద్దతు పలకగా.. మరికొందరు మాత్రం ముందు మీ ఫోన్లు మెరుగుపరచడంపై దృష్టి సారించండి అంటూ కామెంట్లు పెడుతున్నారు.

# పాత ఐటీ రిటర్ను పత్రాలు పడేస్తున్నారా




ఆదాయపు పన్ను చెల్లింపుదారులకు బిగ్ అలర్ట్. మీరు ఐటీఆర్ ఫైల్ చేసి రీఫండ్ పొందిన తర్వాత ఆ రిటర్నులకు సంబంధించిన పత్రాలను పడేయడం లేదా చింపేయడం వంటి పొరపాట్లు చేస్తున్నారా? అయితే ఈ కథనం మీకోసమే. ఐటీ రిటర్నులకు సంబంధించిన డాక్యుమెంట్లను కొన్ని సంవత్సరాల పాటు భద్రపరుచుకోవాల్సి ఉంటుంది. ఇన్‌కమ్ ట్యాక్స్ విభాగం ఎప్పుడైనా మీ పాత ఐటీఆర్ పత్రాలు అడగవచ్చు. అయితే మరి ఎన్ని సంవత్సరాలు పాత ఐటీ రిటర్నుల డాక్యుమెంట్స్ భద్రపరుచుకోవాలి? ఇన్‌కమ్ ట్యాక్స్ చట్టం 1961లో ఐటీఆర్ పత్రాలను ఎన్నేళ్లు భద్రపరచాలి అనేది కచ్చితంగా చెప్పలేదు కానీ, సెక్షన్ 149 ప్రకారం ఇన్‌కమ్ ట్యాక్స్ విభాగం నోటీసులు ఇచ్చేందుకు అవకాశం కల్పించారు. అసెస్మెంట్ ఇయర్ ముగిసిన 8 సంవత్సరాల వరకు ఐటీ శాఖ నోటీసులు పంపించేందుకు వీలుంటుంది. అలాగే విదేశీ ఆదాయ, ఆస్తులు ఉన్న కేసుల్లో అయితే ఇది 16 సంవత్సరాలుగా ఉంటుంది. అంటే ఈ నోటీస్ పీరియడ్ ముగిసే వరకు ఐటీఆర్ పత్రాలను భద్రంగా దాచుకోవాల్సి ఉంటుంది. లేదంటే చిక్కుల్లో పడాల్సి వస్తుంది. వ్యక్తిగత ఆదాయపు పన్ను చెల్లింపుదారులు, హిందూ అవిభాజ్య కుటుంబాలు, వ్యాపారులు తమ ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్నులకు సంబంధించిన రికార్డులను ఏటీఆర్ ఫైల్ చేసిన తర్వాత 8 సంవత్సరాల పాటు భద్రపరచాలని ట్యాక్స్ నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే ఈ 8 ఏళ్లలో ఐటీ శాఖ ఎప్పుడైనా నోటీసులు ఇచ్చేందుకు అవకాశం ఉంది. ఇక విదేశీ ఆదాయం ఆస్తులు ఉన్న కేటగిరీలో ఉన్న వారికి ఇది 16 సంవత్సరాలుగా ఉంటుంది. ఉదాహరణకు మీరు 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఐటీఆర్ ఫైల్ చేశారు అనుకుందాం. వాటికి సంబంధించిన రికార్డులను 2030-31 ఆర్థిక సంవత్సరం ముగిసే వరకు భద్రపరచాల్సి ఉంటుంది. ఇక విదేశీ ఆదాయం, ఆస్తులు ఉంటే 2038-39 ఆర్థిక ఏడాది ముగిసే వరకు ఉండాలి. పాత ఇన్‌కమ్ ట్యాక్స్ రికార్డులను భద్రపరిచేందుకు చాలా కారణాలు ఉన్నాయి. ముఖ్యంగా ఏదైనా తప్పులు దొర్లినప్పుడు మీరు రివైజ్డ్ రిటర్నులు ఫైల్ చేసేందుకు ఉపయోగపడతాయి. గత సంవత్సరాల్లో వచ్చిన నష్టాలు, మినహాయింపు క్లెయిమ్స్‌ను ముందు సంవత్సరాలకు బదిలీ చేసేందుకు అవకాశం లభిస్తుంది. ఇక వ్యాపారాల విషయానికి వస్తే ట్యాక్స్ ఆడిట్ రూల్స్ ప్రకారం కనీసం 8 ఏళ్లు పత్రాలు భద్రపరుచుకోవాల్సి ఉంటుంది. ఒక వేళ ట్యాక్స్ విభాగం నుంచి నోటీసులు అందినప్పుడు అన్ని డాక్యుమెంట్లు భద్రంగా ఉంటే సరైన సమాధానం అందించేందుకు వీలు కలుగుతుంది. ట్యాక్స్ పేయర్లు తమ ఐటీఆర్ ఫైల్ చేసిన తర్వాత తమ శాలరీ, రెంట్, ప్రాపర్టీ ట్రాన్సాక్షన్లకు సంబంధించిన ఫారం 16, 16ఏ, 16బీ, 16సీ భద్రపరుచుకోవాలి. అలాగే యాన్యువల్ బ్యాంక్ స్టేట్మెంట్, పెట్టుబడుల ధ్రువీకరణ పత్రాల వంటివి ఉండాలి. క్యాపిటల్ గెయిన్స్ ఉంటే వాటి రికార్డులు, ఆస్తుల అమ్మకం కొనుగోలు పత్రాలు ఉండాలి. అలాగే లోన్ వడ్డీ సర్టిఫికెట్లు, రెట్ రిసిప్టులు, హెచ్‌ఆర్ఏ క్లెయిమ్స్, దివ్యాగుల ప్రత్యేక అలవెన్స్ ప్రూఫ్స్ వంటివి ఉండాలి.

# భారత్‌లోకి బీవైడీ ప్రవేశం..!



మన దేశంలో తన బీవైడీ అట్టో 2 కాంపాక్ట్ సెడాన్‌ను విడుదల చేసే సన్నాహాల్లో నిమగ్నమైంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారీగా సుంకాలు విధించిన ప్రస్తుత పరిస్థితుల్లో, సంబంధాలు మెరుగుపరుచుకునేందుకు చైనా, భారతదేశాలు ఆసక్తిగా ఉన్న విషయం విదితమే. ఇంతకు ముందు చైనా సంస్థలపై మన ప్రభుత్వం కూడా అంత సానుకూలంగా లేదు. మారిన పరిస్థితుల్లో బీవైడీ తన ఉన్నత స్థాయి అధికార్ల బృందాన్ని చైనా నుంచి మనదేశానికి పంపిస్తోంది. మనదేశంలో బీవైడీ తన కార్లను కొన్నేళ్లుగా విక్రయిస్తోంది. కానీ దిగుమతి చేసుకునే కార్లపై భారీగా సుంకం పడుతున్నందున, ఈ కార్ల ఖరీదు ఎక్కువై, వినియోగదార్లు పెద్దగా కొనడంలేదు. ఇక్కడే కార్లు తయారు చేయటానికి బీవైడీ ఆసక్తికరంగా ఉన్నా, అందుకు అనుమతులు లభించలేదు. తాజా పరిస్థితుల్లో, మనదేశంలో విస్తరించడానికి ఉన్న అవకాశాలను అధ్యయనం చేయడంలో బీవైడీ నిమగ్నమైంది. వచ్చే 6 నెలల్లో అట్టో 2 మోడల్ కారును తక్కువ ధరలో మనదేశంలో విడుదల చేయాలని ఈ సంస్థ భావిస్తోంది. తద్వారా దేశీయ దిగ్గజాలైన టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రాలకు గట్టి పోటీ ఇవ్వాలనే ఆలోచన చేస్తోంది. దీనికి ముందుగా స్థానిక పరిస్థితులను అధ్యయనం చేయడం, ప్రభుత్వ అధికార్లతో సంప్రదింపులు చేపట్టేందుకు తన ఉన్నతాధికార్ల బృందాన్ని ఇక్కడకు పంపిస్తున్నట్లు తెలుస్తోంది. బీవైడీ ఇండియా ఎండీ కెట్సు ఝాంగ్ కూడా ఈ బృందంలో ఉంటారని సమాచారం. లిథియమ్ అయాన్ బ్యాటరీ ఉత్పత్తి కోసం అదానీ గ్రూపుతో బీవైడీ సంప్రదింపులు సాగిస్తోంది. హైదరాబాద్‌కు చెందిన ఒలెక్ట్రా సంస్థతో బస్సుల తయారీ భాగస్వామ్య ఒప్పందం ఎన్నో ఏళ్లుగా బీవైడీకి ఉంది. ట్రక్కుల ఉత్పత్తి కోసం బీవైడీ, హైదరాబాద్‌కే చెందిన మరొక సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్యాలతో నిమిత్తం లేకుండా మనదేశంలో సొంతగా కార్ల తయారీ ప్రారంభించాలని, అవసరమైతే ఏదైనా స్థానిక సంస్థతో భాగస్వామ్యం కుదుర్చుకోవాలని బీవైడీకి ఉంది.

# ప్రపంచకప్‌లో మహిళలకు పట్టం.. రిఫరీలు, అంపైర్ల బృందంలో అందరూ అతివలే!



మహిళా క్రికెట్‌కు విశేష గుర్తింపు తీసుకురావడానికి ప్రయత్నిస్తున్న అంతర్జాతీయ క్రికెట్ మండలి మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఈమధ్యే వరల్డ్ కప్ విజేతలకు ఇచ్చే ప్రైజ్‌మనీని భారీగా పెంచిన ఐసీసీ.. ఇప్పుడు పూర్తిగా మహిళా బృందంతోనే మెగా టోర్నీని నిర్వహించనుంది. అవును.. భారత్, శ్రీలంక ఆతిథ్యమిస్తున్న వన్డే వరల్డ్ కప్‌లో రిఫరీల నుంచి అంపైర్ల వరకూ అందరూ మహిళలే ఉంటారని జై షా (%జీుఆ రాష్టుష్ట్ర%) నేతృత్వంలోని ఐసీసీ స్పష్టం చేసింది. వన్డే ప్రపంచ కప్ చరిత్రలో పూర్తిగా అతివలకే పట్టం కట్టడం ఇదే మొదటిసారి కావడం విశేషం. సెప్టెంబర్ 30 నుంచి వరల్డ్ కప్ టోర్నీ జరుగనుంది. దాంతో.. గురువారం ఐసీసీ మ్యాచ్ నిర్వాహకుల జాబితాను ప్రకటించింది. 18 మంది అధికారిణులు, 14 మంది అంపైర్లు, నలుగురు రిఫరీలతో కూడిన మహిళా బృందాన్ని ఎంపిక చేసింది. 31 రోజుల పాటు జరిగే ఈ మెగా ఈవెంట్ బాధ్యతలను వీళ్లకే అప్పగించింది ఐసీసీ. రెండేళ్ల క్రితం టీ20 వరల్డ్ కప్, కామన్‌వెల్త్ గేమ్స్‌లోనూ మహిళా బృందానికి ప్రాధాన్యం ఇచ్చింది. ఇప్పుడు అదే ట్రెండ్‌కు వన్డే వరల్డ్ కప్‌లోనూ శ్రీకారం చుట్టింది జై షా టీమ్.

**మ్యాచ్ రిఫరీలు :** జీఎస్ లక్ష్మి(భారత్), మిచెల్లె పెరీరా(శ్రీలంక), ట్రుడీ అండర్సన్ (న్యూజిలాండ్), షాంద్రే ఫ్రిట్జ్ (దక్షిణాఫ్రికా).

**ఆన్ ఫీల్డ్ టీవీ అంపైర్లు :** బ్రిందా రథీ, గాయత్రి వేణుగోపాలన్ (భారత్), నిమలీ పెరీరా(శ్రీలంక), సూ రెడ్‌ఫెర్న్ (ఇంగ్లండ్), క్లేరీ పొలొసక్, ఎలోసీ షెరిడాన్(ఆస్ట్రేలియా), కాండసే లా బొర్డే, జాక్వెలిన్ విలియమ్స్(వెస్టిండీస్), కిమ్ కాటన్(న్యూజిలాండ్), సరాహ్ దంబనేవన్ (జింబాబ్వే), షథిరా జకీర్ జెసీ(బంగ్లాదేశ్), కెరరీన్ క్లాస్టే, లారెన్ అజెంబగ్(దక్షిణాఫ్రికా).

'మహిళా క్రికెట్ చరిత్రలో ఇది గర్వించదగ్గ క్షణం. మేము తీసుకున్న ఈ నిర్ణయం మిగతా ఆటలకు కూడా ప్రేరణ అవుతుందని భావిస్తున్నాం. పూర్తిగా మహిళలతో కూడిన బృందాన్ని ఎంపిక చేయడం అనేది ఒక మైలురాయి మాత్రమే కాదు లింగ సమానత్వానికి పాటుపడుతున్న ఐసీసీ నిబద్ధతకు నిదర్శనం' అని షా ఒక ప్రకటనలో వెల్లడించాడు. పదమూడో ఎడిషన్‌కు భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్నాయి. దాంతో.. ఇరుదేశాలకు చెందిన అంపైర్లు, రిఫరీలకు ప్యానెల్‌లో చోటు దక్కింది. ఇక క్లారీ పొలోసాక్, జాక్వెలిన్ విలియమ్స్, సూ రెడ్‌ఫెర్న్‌లు మూడోసారి వరల్డ్ కప్ నిర్వహణలో భాగం కానున్నారు. సెప్టెంబర్ 30న జరుగబోయే వరల్డ్ కప్ ఆరంభ పోరులో భారత్, శ్రీలంక తలపడనున్నాయి.

## వరల్డ్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ సెమీస్‌లోకి పూజా రాణి



వార్సా: ఇండియన్ బాక్సర్ పూజా రాణి ప్రపంచ చాంపియన్‌షిప్ పోటీల్లో పతకాన్ని ఖాయం చేసుకున్నది. మహిళల 80 కేజీల విభాగంలో ఆమె సెమీఫైనల్లోకి ప్రవేశించింది. దీంతో పూజా రాణికి మెడల్ దక్కడం అనివార్యం కానున్నది. క్వార్టర్స్‌లో పోలాండ్ క్రీడాకారిణి ఎమిలియా కోటెర్స్కాను చిత్తు చేసి పూజా విజయాన్ని నమోదు చేసింది. ఈ పోటీల్లో తొలి రౌండ్‌లో 34 ఏళ్ల పూజాకు బై దక్కింది. అయితే అనుభవం ఉన్న పూజా.. క్వార్టర్స్‌లో టీనేజర్ ఎమిలియాపై 3-2 తేడాతో విక్టరీ సొంతం చేసుకున్నది. గురువారం రాత్రి ఈ బౌట్ జరిగింది. 80 కేజీల విభాగంలో ఫైట్‌ను నాన్ ఒలింపిక్ వెయిట్ కేటగిరీగా భావిస్తారు. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో మొత్తం 12 మంది బాక్సర్లు ఈ కేటగిరీలో పోటీపడుతారు. ఈ పోటీల్లో ఇప్పటికే రెండు మెడల్స్ ఖాయం అయ్యాయి. జాస్మిన్ లాంబోరియా, నుపుర్ షీరాన్ బాక్సర్లకు మెడల్స్ దక్కనున్నాయి. ఆ ఇద్దరు కూడా సెమీస్‌లోకి ప్రవేశించారు. పురుషుల కేటగిరీలో భారత్‌కు తీవ్ర నిరాశ ఎదురైంది. అభినాశ్ జామ్వాల్ 65 కేజీల విభాగంలో క్వార్టర్స్‌లో ఓడారు. గత ఏడాది జరిగిన వరల్డ్ చాంపియన్‌షిప్ టోర్నీలో మహిళల విభాగంలో ఇండియాకు నాలుగు స్వర్ణ పతకాలు దక్కాయి. నీతూ ఘూంగాస్, నిఖ్కత్, లవ్లీనా బోర్గోహెయిన్, సావేతి బోరా ఇండియాకు పతకాలను అందించారు. సెమీఫైనల్లో లోకల్ బాక్సర్ ఎమిలీ అస్క్విత్‌తో పూజా రాణి తలపడనున్నారు.

# స్పోర్ట్స్

## టీమిండియాతో మ్యాచ్.. పాకిస్తాన్‌కు భారీ షాక్!?



ఆసియాకప్-2025లో పాకిస్తాన్ తమ తొలి మ్యాచ్ ఆడేందుకు సిద్ధమైంది. శుక్రవారం (సెప్టెంబర్12) దుబాయ్ వేదికగా ఒమన్‌తో పాక్ తలపడనుంది. అయితే ఈ మ్యాచ్‌కు ముందు పాక్ జట్టుకు గట్టి ఎదురు దెబ్బ తగిలినట్లు తెలుస్తోంది. ఆ జట్టు కెప్టెన్ సల్మాన్ అలీ అఘాకు స్వల్ప గాయమైనట్లు వార్తలు వస్తున్నాయి. దీంతో బుధవారం (సెప్టెంబర్ 10) దుబాయ్‌లోని ఐసీసీ అకాడమీలో జరిగిన ప్రాక్టీస్ సెషన్‌కు అతడు దూరంగా ఉన్నట్లు పాక్ మీడియా వర్గాలు వెల్లడించాయి. జియో న్యూస్ రిపోర్ట్ ప్రకారం.. ప్రాక్టీస్ సెషన్‌లో సల్మాన్ ఆఘా నెక్ బ్యాండ్‌తో కన్పించినట్లు సమాచారం. జట్టుతో పాటు ఐసీసీ ఆకాడమీకి వెళ్లినప్పటికి అతడు ఎటువంటి ప్రాక్టీస్‌లోనూ పాల్గోలేదంట. ఈ క్రమంలో భారత్‌తో మ్యాచ్‌కు ముందు తమ కెప్టెన్ గాయం బారిన పడడంతో పాకిస్తాన్ శిబిరంలో ఆందోళన నెలకొంది. అయితే ముందుస్తు జాగ్రత్తలో భాగంగానే అతడి విశ్రాంతికి ఇచ్చినట్లు పాక్ క్రికెట్ వర్గాలు వెల్లడించాయి. అతడు ప్రస్తుతం మెడ నొప్పితో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ ఒమన్‌తో జరిగే తొలి మ్యాచ్‌కు అఘా దూరమైనా.. భారత్‌తో మ్యాచ్‌కు మాత్రం పూర్తి ఫిట్‌నెస్ సాధించే అవకాశముంది. అప్పటికి అతడి గాయం తీవ్రమై భారత్ మ్యాచ్‌కు దూరమైతే పాక్‌కు గట్టి ఎదురు దెబ్బే అని చెప్పుకోవాలి. కాగా పాకిస్తాన్ దాదాపు రెండు వారాల ముందే యూఏఈకు చేరుకుంది. ఆసియాకప్ టోర్నీ సన్నాహకాల్లో భాగంగా అఫ్గానిస్తాన్-యూఏఈలతో ట్రైసిరీస్‌లో పాక్ తలపడింది. ఫైనల్లో అఫ్గాన్‌ను చిత్తు చేసి టైటిల్‌ను పాక్ సొంతం చేసుకుంది. అదే జోరును ఇప్పుడు ఆసియాకప్‌లోనూ కొనసాగించాలని మెన్ ఇన్ గ్రీన్ పట్టుదలతో ఉంది. ఈ మెగా టోర్నీలో భాగంగా ఆదివారం దుబాయ్ వేదికగా భారత్-పాక్ జట్లు అమీతుమీ తెల్చుకోనున్నాయి.

**ఆసియాకప్‌కు పాక్ జట్టు**

సల్మాన్ అఘా (కెప్టెన్), అబ్రార్ అహ్మద్, ఫహీమ్ అష్రాఫ్, ఫకర్ జమాన్, హారిస్ రవూఫ్, హసన్ అలీ, హసన్ నవాజ్, హుస్సేన్ తలాత్, ఖుష్దిల్ షా, మహ్మద్ హారిస్ (వికెట్ కీపర్), మహ్మద్ నవాజ్, మహ్మద్ వాసిమ్ జూనియర్, షహిబ్‌జాద ఫర్హాన్, సయామ్ ఆయుబ్, సల్మాన్ మిర్జా, షహీన్ షా అఫ్రిది, సుఫ్యాన్ మోకిమ్



## ఆడియన్స్ పిచ్చోళ్లా.. ఇంత సపోర్ట్ చేస్తారా?: యంగ్ హీరో

ఈ మధ్యకాలంలో టాలీవుడ్ సినిమాలన్నీ బాక్సాఫీస్ వద్ద బోల్తా పడుతున్నాయి. భారీ అంచనాలతో వచ్చిన స్టార్ హీరోల సినిమాలు సైతం సరిగ్గా ఆడడం లేదు. ఇలాంటి సమయంలో తక్కువ బడ్జెట్ వచ్చిన చిన్న సినిమా 'లిటిల్ హార్ట్స్' భారీ విజయం సాధించింది. మౌళి తనూజ్, శివానీ నాగరం జంటగా నటించిన ఈ చిత్రం రిలీజైన తొలిరోజే(సెప్టెంబర్ 5) హిట్ టాక్ తెచ్చుకొని.. ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద దూసుకెళ్తుంది. ఈ నేపథ్యంలో తాజాగా చిత్రబృందం సక్సెస్ మీట్‌ని ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా హీరో మౌళి మాట్లాడుతూ ఈ సినిమా ఇంత పెద్ద విజయం సాధిస్తుందని ఊహించలేదని అన్నారు. 'ఆడియన్స్.. పిచ్చోళ్లా మీరు. ఒక మంచి సినిమా వస్తే ఇంత సపోర్ట్ చేస్తారా. మేము అస్సలు ఊహించలేదు. మంచి సినిమా చేశామని తెలుసు. తొలి వారం కొంతమంది చూస్తారు. మౌత్ టాక్‌తో రెండో వారం నడుస్తుందేమో అనుకున్నాం. అలా అనుకొనే గట్టిగా ప్రమోషన్స్ చేశాం. అయినా కూడా ప్రేక్షకులు థియేటర్స్‌కి వస్తారా రారా అనుకున్నాం. కానీ ప్రీమియర్స్, ఫస్ట్ రోజు..థియేటర్స్ అన్ని నిండిపోయాయి. ఫస్ట్‌డే రూ.2.5 కోట్ల కలెక్షన్స్ రాబట్టింది. ఇది మా సినిమా బడ్జెట్ కంటే చాలా ఎక్కువ. పిచ్చోళ్లం అయిపోయాం. మమ్మల్ని నమ్మి సినిమాకు వచ్చిన ఆడియన్స్‌కి థ్యాంక్స్. ఈ వారం ఎన్నిసార్లు ఏడ్చానో నాకే తెలియదు. ఇంత ప్రేమ ఎందుకు చూపిస్తునారనో నాకే అర్థం కాలేదు. ఎవరైనా సినిమా బాగోలేదని కామెంట్ పెడితే.. వాళ్లను తిడుతూ రిప్లై ఇస్తున్నారు. రవితేజ, నాని మొదలు ఇండస్ట్రీ పెద్దలంతా మా సినిమాను మెచ్చుకుంటూ ట్వీట్స్ చేశారు. చాలా సంతోషంగా ఉంది. ఇలానే కష్టపడి మంచి సినిమాలు తీస్తానని అందరికి మాట ఇస్తున్నా' అన్నారు. సాయి మార్తాండ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి సింజిత్ యెర్రమల్లి సంగీతం అందించారు. 2009-2020 మధ్యకాలంలో జరిగే టీనేజ్ లవ్‌స్టోరీ ఇది. సినిమా ప్రారంభం నుంచి ముగింపు వరకు ఆద్యంతం వినోదాత్మకంగా సాగుతుంది. యువత బాగా ఎంజాయ్ చేస్తున్నారు.

## 'సిద్ధు జొన్నలగడ్డ' కొత్త సినిమా.. రొమాంటిక్ టీజర్ చూశారా?

'తెలుసు కదా' సినిమా నుంచి క్లాసిక్ టీజర్ విడుదలైంది. సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తున్న రొమాంటిక్ డ్రామా చిత్రంలో హీరోయిన్‌గా రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి నటిస్తున్నారు. స్టైలిస్ట్ నీరజ కోన దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, కృతీ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమా అక్టోబరు 17న విడుదల కానుంది. డీజే టిల్లు, టిల్లు స్క్వేర్' వంటి హిట్ చిత్రాల తర్వాత ఆయన నటించిన మూవీ జాక్ నిరుత్సాహపరిచింది. దీంతో 'తెలుసు కదా' మూవీపైనే ఆయన ఆశలు పెట్టుకున్నారు. ఇందులో వైవా హర్ష కీలక పాత్రలో నటించారు. తమన్ సంగీతం అందించారు.





## ఈ సినిమా దెబ్బకు బాక్సాఫీస్ షేక్ మామ.. 30 కోట్లు పెడితే 115 కోట్ల కలెక్షన్స్..

దాదాపు ఏడాది క్రితం విడుదలై థియేటర్లలో సునామీ సృష్టించింది. తక్కువ సమయంలో రికార్డులతో సత్తా చాటింది. కేవలం 30 కోట్లతో నిర్మించిన ఈ మూవీ పాన్ ఇండియా బాక్సాఫీస్ వద్ద ఏకంగా రూ.115 కోట్లకు పైగా వసూల్లు రాబట్టింది. యానిమల్, లక్ష్యస్ కిల్ వంటి హై-బడ్జెట్ యాక్షన్ చిత్రాలు ఆధిపత్యం చెలాయించే సినిమాటిక్ ల్యాండ్‌స్కేప్‌లో, నిరాడంబరమైన బడ్జెట్‌తో నిర్మించిన ఈ చిత్రం ఆశ్చర్యకరమైన విజయాన్ని సాధించింది. ఇది సంవత్సరంలో అత్యంత హింసాత్మక చిత్రంగా నిలిచింది. ఆ సినిమా పేరు మార్కో. హనీఫ్ అదేని దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో ఉన్ని ముకుందన్ ప్రధాన పాత్రలో నటించారు. డిసెంబర్ 2024లో తెలుగు, హిందీ, తమిళ భాషలలో విడుదలైన మార్కోను రూ. 30 కోట్ల బడ్జెట్‌తో నిర్మించారు. తక్కువ బడ్జెట్‌తో నిర్మించిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ. 115 కోట్లకు పైగా వసూలు చేసి, భారతీయ బాక్సాఫీస్ నుండి రూ. 60.27 కోట్లు వసూలు చేసింది. మార్కో విజయంతో చిత్రనిర్మాతలు సీక్వెల్ 'మార్కో 2' చిత్రాన్ని రూపొందించాలని నిర్ణయించుకున్నారు. ది మలయాళ సినిమా పరిశ్రమలో సంచలన విజయం సాధించిన సినిమా.

## బాలీవుడ్ కల్ట్ క్లాసిక్ 'రంగీలా' రీ-రిలీజ్.. ప్రకటించిన రామ్ గోపాల్ వర్మ




బాలీవుడ్ కల్ట్ క్లాసిక్ సినిమాలలో ఒకటైన 'రంగీలా' సినిమాను రీ రిలీజ్ చేయబోతున్నట్లు ప్రకటించాడు ఆ చిత్ర దర్శకుడు రామ్ గోపాల్ వర్మ. ఈ సినిమా విడుదలై సెప్టెంబర్ 08 నాటికి 30 ఏళు పూర్తయిన సందర్భంగా చిత్ర నిర్మాణ సంస్థ 'అల్ట్రా మీడియా' ఈ సినిమాను త్వరలోనే 4కే వెర్షన్‌లో రీ రిలీజ్ చేయబోతుందని వర్మ సోషల్ మీడియా వేదికగా తెలిపాడు. 'రంగీలా' సినిమా 1995లో విడుదలై బాక్సాఫీస్ వద్ద విజయం సాధించింది. ఈ సినిమాలో ఆమిర్ ఖాన్, ఊర్మిళ మాతోండ్కర్, జాకీ ష్రాఫ్ ప్రధాన పాత్రలు పోషించారు. ఈ సినిమాతోనే ఏ.ఆర్. రెహమాన్ బాలీవుడ్‌కి సంగీత దర్శకుడిగా పరిచయమయ్యారు. ఈ చిత్రానికి ఆయన అందించిన పాటలు అప్పట్లో సంచలనం సృష్టించాయి. అయితే ఈ సినిమా మళ్లీ థియేటర్లలో ఎప్పుడు విడుదలవుతుందనేది ఇంకా స్పష్టంగా తెలియదు, కానీ అక్టోబరులో రీ-రిలీజ్ అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది.



## 'కిష్కింధపురి' లాంటి హారర్ సినిమా ఇప్పటివరకూ రాలేదు

**హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్**

భైరవం తర్వాత హీరో బెల్లం కొండ సాయి శ్రీనివాస్ నటించిన సినిమా కిష్కింధ పురి. అనుపమా పరమేశ్వర్ హీరోయిన్ గా నటించింది. ఇప్పటికే అన్ని హంగులు పూర్తి చేసుకున్న ఈ సినిమా సెప్టెంబర్ 12న విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు. 'నేను ఆడియన్స్ కి నచ్చే సినిమాలు చేయడానికి ఇష్టపడతాను. ఆ క్రమంలో చాలా వరకూ మాస్ కమర్షియల్ ఎంటర్టైనర్స్ వచ్చాయి. అయితే నాకు పర్సనల్ గా ఇలాంటి డిఫరెంట్ సినిమాలు చాలా ఇష్టం. డైరెక్టర్ కౌశిక్ కలిసినప్పుడు కూడా మేము ఇదే మాట్లాడుకున్నాం. అప్పుడు కిష్కింధపురి కథ చెప్పారు. చాలా నచ్చింది. నిజంగా నాకు బాగా ఇష్టమైన జానర్ ఇది. ఆడియన్స్ కి చాలా మంచి ఎక్స్పీరియన్స్ ఉంటుందని చేసాం. నిన్న ఫస్ట్ టైం థియేటర్స్ లో చూసాం. సినిమా అదిరిపోయింది. ముఖ్యంగా సౌండ్. సలార్ యానిమల్ కాంతారా సినిమాలకు పనిచేసిన సౌండ్ డిజైనర్ రాధాకృష్ణ గారు సౌండ్ ని అద్భుతంగా డిజైన్ చేశారు. మైండ్ బ్లోయింగ్ గా ఉంది. ఈ సినిమాకి అద్భుతమైన సౌండ్ డిజైన్ చేసే స్పేస్ ఉంది. హారర్ మిస్టరీ ఉన్న ఒక కొత్త జానర్ ఇది. టెక్నికల్ అద్భుతంగా ప్రజెంట్ చేశాం. థ్రిల్లర్ జానర్ లో చేసిన రాక్షసుడుకి చాలా మంచి అప్లోజ్ వచ్చింది. మహిళ ప్రేక్షకుల నుంచి కూడా సినిమాకి గొప్ప ఆదరణ లభించింది. చాలా రోజుల తర్వాత కిష్కింధపురి తో ఒక స్ట్రైట్ ఫిల్మ్ చేసే అవకాశం దొరికింది. సినిమా మీద చాలా కాన్ఫిడెంట్ గా ఉన్నాము. ఖచ్చితంగా కిష్కింధపురి' ఆడియన్స్ కి ఒక డిఫరెంట్ థ్రిల్, సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ అందించబోతుంది' 'దర్శకుడు కౌశిక్ కు మంచి కథ రెడీ చేసుకున్నాడు. అయితే ఇలాంటి జోనర్స్ సినిమాలకి బడ్జెట్ లిమిటేషన్స్ ఉంటాయి. కానీ సాహు గారు ఆడియన్స్ కి ద బెస్ట్ ఇవ్వాలని టెక్నికల్ గా గ్రాఫిక్స్ పరంగా ఎక్కడ కాంప్రమైజ్ కాకుండా సినిమాని నిర్మించారు. సినిమాకి కావాల్సిన ప్రతిదీ ఇచ్చారు. ఈ సినిమా చేయడం చాలా ప్రౌడ్ గా ఉంది. సినిమాని ఇలా కూడా తీయొచ్చా అనిపించేలా చేసిన సినిమా ఇది. ఈ సినిమా కథలోనే యాక్షన్ ఉంది. మొత్తం ఆర్గానిక్ గా చేసిన సినిమా ఇది. విజువల్ ఎఫెక్ట్స్ సౌండ్ పరంగా ఆడియన్స్ చాలా థ్రిల్ అవుతారు. హారర్ సినిమాలో ఇంత కథ ఉన్న సినిమా నేను ఎప్పుడో చూడలేదు. హారర్ మిస్టరీ రెండు బ్లెండ్ అయిన సినిమా ఇది. ఆడియన్స్ కి సీట్ ఎడ్జ్ ఎక్స్ ఎక్స్ పీరియన్స్ ఇస్తుంది. ఇక అనుపమ పెర్ఫార్మెన్స్ కొత్తగా వుంటుంది. నిజానికి అలాంటి క్యారెక్టర్ చేయడం చాలా టఫ్. నాకు హారర్ సినిమాలంటే ఇష్టం. మా ప్రొడక్షన్ లో చేసిన కాంచన లాంటి సినిమాలు చాలా ఎంజాయ్ చేశాను. టీనేజ్ లో ఉన్నప్పుడు కూడా హారర్ సినిమాలంటే ఇష్టం. ఈ సినిమాని టీనేజ్ ఆడియన్స్ కూడా చాలా ఎంజాయ్ చేస్తారు. హారర్ కారణంగా సినిమాకి ఏ సర్టిఫికేట్ వచ్చింది. ఇంత సీరియస్ హారర్ సినిమా చూసి చాలా కాలం అయిందని సెన్సార్ సభ్యులు చెప్పడం ఆనందాన్నిచ్చింది. ఇలాంటి సినిమాలు అందరూ కలిసి ప్యాక్డ్ థియేటర్లో చూస్తున్నప్పుడు ఆ ఎక్స్పీరియన్స్ వేరే లెవెల్ లో ఉంటుంది.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G.
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.